
ఎ.రంగంపేటలో డబుల్ ఎంట్రీలు


పనిచేయని ఈసీ హెచ్చరికలు

ఓటర్ల జాబితా తప్పుల తడక



160,857 నెంబర్లతో రెండుసార్లు ఓటరుగా నమోదైన మమత






440,553నెంబర్లతో రెండుసార్లు ఓటరుగా నమోదైన రాజవర్ధన్






కేంద్ర ఎన్నికల కమిషన్ ఎన్ని హెచ్చరికలు చేసినా, ఎన్ని నోటీసులు జారీ చేసినా తాజా ఓటర్ల జాబితా మాత్రం సక్రమంగా తయారు కాలేదు. జిల్లావ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లోనూ ఓటర్ల జాబితాలు తప్పుల తడకలుగానే కనిపిస్తున్నాయి. రోజులు గడిచేకొద్దీ క్షేత్రస్థాయి పరిశీలనలో ఓటర్ల జాబితా అవకతవకలు వెలుగులోకి వస్తున్నాయి.

శ్రీకాళహస్తిలో ఎమ్మెల్యే అత్తగారికి రెండు ఓట్లు



శ్రీకాళహస్తి ఎమ్మెల్యే ఇంటి చిరునామాతో ఓటరుగా నమోదైన అనసూయమ్మ- మరో ఇంటి చిరునామాతో కూడా ఓటరుగా అనసూయమ్మ

తిరుపతి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి):శ్రీకాళహస్తిలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన రెడ్డి అత్తగారి (భార్య తల్లి) పేరిట రెండు ఓట్లు నమోదయ్యాయి. పట్టణంలోని ఏఎం పుత్తూరు పోలింగ్ కేంద్రం నంబరు 104 పరిధిలో ఇంటి నంబరు 15-507 చిరునామాపై సామాను అనసూయమ్మ (70)కు ఓటరు సీరియల్ నంబరు 840, ఎపిక్ నంబరు యూసీజీ 0032995లతో ఓటరుగా జాబితాలో నమోదైంది. అయితే అదే పోలింగ్ కేంద్రం పరిధిలోనే ఇంటి నంబరు 15-371 చిరునామాపై ఓటరు సీరియల్ నంబరు 459, ఎపిక్ నంబరు ఎంఎన్‌వీ 2684942లతో మరో ఓటు కూడా నమోదై వుంది. ఇందులో ఆమె వయసు 52గా పేర్కొని వుంది.రెండు వేర్వేరు ఎపిక్ కార్డులు జారీ కాగా మొదటి కార్డు ఒరిజినల్‌గా భావించాల్సి వుంది. ఎందుకంటే మొదటి ఎపిక్ కార్డులో పేర్కొన్న చిరునామా ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన రెడ్డి ఇంటిది. అందులోనే ఆయన అత్తగారైన అనసూయమ్మ కూడా నివాసముంటున్నారు. రెండవ ఎపిక్ కార్డులో నమోదైన చిరునామాలో వాస్తవంగా పెత్తం పార్వతమ్మ, గంగరామిరెడ్డి దంపతులు నివాసముంటున్నారు. అది వారి సొంతిల్లు. అదే చిరునామాతో ఆ దంపతులిద్దరూ ఓటర్లుగా నమోదై వున్నారు. దీంతో ఎమ్మెల్యే అత్తగారి పేరిట నమోదైన రెండవ ఓటు నకిలీదిగా భావించాల్సి వస్తోంది.



ఒకే బూత్‌లో రెండుసార్లు ఓటరుగా నమోదైన శివ



అనసూయమ్మ ఓటరుగా నమోదైన ఇంటిలో నివసిస్తున్న పార్వతి,గంగారామిరెడ్డి దంపతులు



పార్వతి ఓటరు కార్డు

ఎ. రంగంపేటలో పలు డబుల్ ఎంట్రీలు

చంద్రగిరి నియోజకవర్గ ఓటర్ల జాబితాలో అవకతవకల గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే. తాజాగా చంద్రగిరి మండలం ఎ.రంగంపేటలో పోలింగ్ కేంద్రం నంబరు 111 పరిధిలో పలు డబుల్ ఎంట్రీలు వెలుగులోకి వచ్చాయి. 2-30 నంబరు ఇంటిలో నివాసముంటున్న అరిగల సుధాకర్ కుమారుడు అరిగల శివ (29) పేరు ఓటరు సీరియల్ నంబరు 316, ఎపిక్ నంబరు ఐఏఎక్స్ 3248986లతో జాబితాలో నమోదై వుంది. అయితే అదే పోలింగ్ కేంద్రం పరిధిలో అదే చిరునామాతో ఓటరు సీరియల్ నంబరు 317, ఎపిక్ నంబరు ఐఏఎక్స్ 2024826లతో అతడి పేరు జాబితాలో రెండవసారి నమోదైంది. రెండు చోట్లా ఫొటో ఒకటే అప్‌లోడ్ అయింది. అలాగే పోలింగ్ కేంద్రం 111 పరిధిలోనే 1-66-1 ఇంటి నంబరు చిరునామాతో ఎ.సుబ్రమణ్యం కుమార్తె ఎ.మమత (19) ఓటరు సీరియల్ నంబరు 160, ఎపిక్ నంబరు ఐఏఎక్స్ 3232675లతో ఓటరుగా నమోదయ్యారు. అదే జాబితాలో మమత పేరు అదే చిరునామాతో ఓటరు సీరియల్ నంబరు 857, ఎపిక్ నంబరు ఐఏఎక్స్ 3346913లతో మరో చోట కూడా నమోదై వుంది. ఆ పోలింగ్ కేంద్రంలోనే 2-88 ఇంటి నంబరు చిరునామాతో చిత్తూరు ధనరాజ కుమారుడు చిత్తూరు రాజవర్ధన్ (19) పేరు ఓటరు సీరియల్ నంబరు 440, ఎపిక్ నంబరు ఐఏఎక్స్ 3208618లతో ఓటరు జాబితాలో నమోదైంది. అదే పోలింగ్ స్టేషన్, అదే చిరునామాతో ఇతడి పేరు ఓటరు సీరియల్ నంబరు 543, ఎపిక్ నంబరు ఐఏఎక్స్ 3254455లతో మళ్ళీ జాబితాలో నమోదైంది. ఇవన్నీ కూడా గతేడాది అక్టోబరు 27 - ఈనెల 22 తేదీల మధ్యలో నమోదైనవే కావడం గమనార్హం. ఇదివరకే తిరుపతి రూరల్ మండల పరిధిలో ఈ తరహా డబుల్ ఎంట్రీలను పెద్దసంఖ్యలో గుర్తించిన నేపథ్యంలో తాజాగా చంద్రగిరి మండలంలోనూ బయటపడుతున్నాయి. దీన్ని బట్టి చూస్తే కేంద్ర ఎన్నికల సంఘం హెచ్చరికలు చంద్రగిరి నియోజకవర్గంలో ఓటర్ల జాబితా తయారు చేసిన అధికారులు, ఉద్యోగులపై ప్రభావం చూపలేదనే భావించాల్సి వస్తోంది.

హుండీ, వడ్డీ ఆదాయాలే
ప్రధాన వనరులు

రూ.5,141.74 కోట్ల బడ్జెట్‌కు టీటీడీ బోర్డు ఆమోదం

కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి జీతాల పెంపు



టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశం

తిరుమల, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ఈసారి బడ్జెట్‌లోనూ శ్రీవారి హుండీ, వడ్డీల ద్వారానే ఆదాయాలు భారీగా సమకూరుతాయని అంచనా వేసింది.వచ్చే ఆర్థిక సంవత్సరానికి రూ.5,141.74 కోట్ల అంచనాలతో రూపొందించిన బడ్జెట్‌కు టీటీడీ ధర్మకర్తల మండలి సోమవారం ఆమోదం తెలిపింది. గడిచిన ఏడాది హుండీ ద్వారా రూ.1,591 కోట్లు ఆదాయం వస్తుందని అంచనా వేయగా, రూ.1,611 కోట్ల కానుకలు లభించాయి. ఈ క్రమంలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి కూడా రూ.1,611 కోట్ల హుండీ ఆదాయం లభిస్తుందని టీటీడీ అంచనా వేసింది. రూ.900 కోట్ల నుంచి రూ.వెయ్యి కోట్లలోపు ఉండే హుండీ ఆదాయ అంచనాలు కొవిడ్ అనంతరం భారీగా పెరిగాయి. 2022-23 బడ్జెట్‌లో హుండీ ద్వారా రూ.వెయ్యి కోట్లు లభిస్తుందని అంచనా వేయగా రూ.1,613 కోట్లు లభించిన విషయం తెలిసిందే. ఈక్రమంలో హుండీ ఆదాయం టీటీడీకి ప్రధాన అదాయ వనరుగా మారింది. మరోవైపు వడ్డీల ద్వారా రూ.990 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేయగా, రూ.1,068.51 కోట్లు లభించింది. ఈ క్రమంలో నూతన బడ్జెట్‌లో రూ.1,167 కోట్ల ఆదాయం వడ్డీల ద్వారా లభిస్తుందని టీటీడీ అంచనా వేస్తోంది. మరోవైపు ప్రసాదాల ద్వారా రూ.500 కోట్లు లభిస్తుందని భావించగా రూ.50 కోట్లు పెరిగింది. ఈ క్రమంలో రానున్న ఆర్థిక సంవత్సరంలో రూ.600 కోట్లు వస్తుందని భావిస్తున్నారు. తలనీలాల విక్రయాల ద్వారా గత బడ్జెట్‌లో రూ.126.50 కోట్లు వస్తుందని టీటీడీ అంచనా వేయగా రూ.226.50 కోట్ల ఆదాయం సమకూరింది. అయినప్పటికీ నూతన బడ్జెట్‌లో రూ.151.50 కోట్లు మాత్రమే లభిస్తుందని టీటీడీ అంచనా వేసింది. మరోవైపు ఇంజనీరింగ్ పనులకు టీటీడీ ఈసారి రూ.190 కోట్లు కేటాయించింది. సాధారణంగా రూ.వంద కోట్ల నుంచి రూ.120 కోట్ల వరకు ఇంజనీరింగ్ పనులకు నిధులను కేటాయిస్తారు. ఈ క్రమంలోనే టీటీడీ గత బడ్జెట్‌లోనూ రూ.120 కోట్లు కేటాయించగా రూ.150 కోట్లు వినియోగించారు.తాజా బడ్జెట్‌లో ఇంజనీరింగ్ పనులకు ఏకంగా రూ.190 కోట్లు ఖర్చుల్లో జతచేసింది.తిరుపతిలో నిర్మించిన శ్రీనివాససేతు ఫ్లైఓవర్‌కు రూ.53 కోట్లు కేటాయించారు. కాగా టీటీడీలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి వేతనాలను పెంచామని ఛైర్మన్ కరుణాకర రెడ్డి తెలిపారు. సోమవారం జరిగిన బోర్డు సమావేశ నిర్ణయాలను ఆయన మీడియాకు వివరించారు. టీటీడీ పాలనా వ్యవహారాలు మరింత వేగవంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ఐదేళ్ల కాలపరిమితికి గాను ఒరాకిల్ ఫ్యూజన్ క్లౌడ్ ఐఆర్పీ ప్రవేశపెట్టేందుకు ఆమోదం తెలిపామన్నారు.



అనంతపురం సభకు 'సిద్ధం' పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మంత్రులు పెద్దిరెడ్డి, రోజా తదితరులు

తిరుపతి ఎంపీ సీటుకు
కొత్త అభ్యర్థిని ప్రకటిస్తాం

టికెట్లు రానివారిని ఇతర పదవులతో సంతృప్తిపరుస్తాం - మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి

తిరుపతి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం తనపై చేసిన వ్యాఖ్యలను ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నానని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి చెప్పారు. అనంతపురంలో వచ్చే నెల మొదటివారంలో జరగనున్న వైసీపీ 'సిద్ధం' సభ ఏర్పాట్లపై చర్చించేందుకు పెద్దిరెడ్డి ఆధ్వర్యంలో తిరుపతిలో సోమవారం సమావేశం జరిగింది.జన సమీకరణ ఏర్పాట్లపై వైసీపీ ఎమ్మెల్యేలతో, నాయకులతో మంత్రి చర్చించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. తాను అవినీతిపరుడో కాదో ప్రజలకు తెలుసునని, ఆదిమూలంపై క్రమశిక్షణ చర్యలు తప్పవని స్పష్టం చేశారు. తిరుపతి ఎంపీగా ఆదిమూలం స్థానంలో కొత్త అభ్యర్థిని పార్టీ ప్రకటిస్తుందన్నారు.టికెట్లు రానివారిని ఇతర పదవులతో సంతృప్తిపరిచేందుకు పార్టీ సిద్ధంగా ఉందని చెప్పుకొచ్చారు. రాయలసీమ జిల్లాల్లో అన్ని సీట్లనూ వైసీపీ గెలుచుకుంటుందన్నారు.

పార్టీ ఆదేశిస్తే ఒంగోలుకు సిద్ధమే : మంత్రి రోజా

మంత్రి రోజా మాట్లాడుతూ 'నగరి నియోజకవర్గంలో పనిచేసుకుంటున్న నేను ఒంగోలుకు పోవాల్సిన అవసరం ఏముందో అర్థం కావడంలేదు. ఒకవేళ పార్టీ ఆదేశిస్తే ఒంగోలు ఎంపీగా పోటీ చేసేందుకు కూడా నేను సిద్ధమే' అన్నారు. తాను నామినేటెడ్ పదవులు అమ్ముకుంటున్నానని చంద్రబాబు ఆరోపించడం విడ్డూరంగా ఉందన్నారు. టీడీపీలో ఉన్నప్పుడు ఎవరి దగ్గరైనా ఒక్క రూపాయి తీసుకునివుంటే నిరూపించాలన్నారు. వైసీపీ పుణ్యంతో కౌన్సిలర్ అయిన మహిళ ఎవరో చెప్పిన మాటలకు లొంగి తనపై బురద జల్లారని, అలాంటివాళ్లకు భగవంతుడే సమాధానం చెబుతాడన్నారు.టీడీపీ, జనసేన పార్టీలకు నాయకులు లేక అభ్యర్థుల జాబితా విడుదల చేయలేకపోతున్నారన్నారు. హైదరాబాద్‌లో ఉంటూ ఏపీలో రాజకీయాలు చేసే నాన్‌లోకల్ లీడర్లు ఎక్కువైపోయారంటూ ఎద్దేవా చేశారు.చంద్రబాబు, పవన్ మధ్యలో నాలుగో కృష్ణుడిలాగా షర్మిల ప్రవేశించిందన్నారు. రాష్ట్రాన్ని ముక్కలు చేసిన కాంగ్రెస్ పార్టీలో చేరి వైఎస్ కుటుంబాన్ని ముక్కలు చేస్తోందన్నారు. మంత్రి పెద్దిరెడ్డిపై ఎమ్మెల్యే ఆదిమూలం చేసిన వ్యాఖ్యలు కరెక్టు కాదన్నారు. రాజకీయాల్లో హత్యలుండవు, ఆత్మహత్యలే ఉంటాయని చెప్పడానికి ఆదిమూలం వ్యాఖ్యలే నిదర్శనమని చెప్పారు.


● పలువురు నేతల డుమ్మా

రాయలసీమ పరిధిలోని పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీలు, వైసీపీ కోఆర్డినేటర్లు ఈ సమావేశానికి హాజరయ్యారు.ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, మంత్రి జయరాం,ఎంపీ గోరంట్ల మాధవ్, పూతలపట్టు, సత్యవేడు, మదనపల్లె ఎమ్మెల్యేలు ఎంఎస్ బాబు, ఆదిమూలం, నవాజ్ భాషా, తిప్పేస్వామి సమావేశానికి రాలేదు.అదేవిధంగా జమ్మలమడుగు ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే ఎర్రకోట కేశవరెడ్డి, ఆదోని ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి, రాజంపేట, కదిరి ఎమ్మెల్యేలు మేడా మల్లికార్జున్ రెడ్డి, సిద్దా రెడ్డి కూడా హాజరు కాలేదు.కొందరు ఎమ్మెల్యేలు వ్యక్తిగత కారణాలతో రాలేకపోయారని పెద్దిరెడ్డి చెప్పుకొచ్చారు.తిరుపతిలో సమావేశం జరిగినప్పటికీ స్థానిక నేతలు కన్పించకపోవడాన్ని పలువురు చర్చించుకోవడం కనిపించింది.ఎంపీ గురుమూర్తి మినహా తక్కినవారు సమావేశంలో కనిపించలేదు.

విద్యుత్తు కార్మికులపై గంజాయి మూక దాడి

● రోడ్డుకడ్డంగా ఉన్న వాహనాలను తీయమన్నందుకు రెచ్చిపోయిన వైనం

● ఇద్దరి పరిస్థితి విషమం.. నలుగురికి తీవ్రగాయాలు



రుయాస్పత్రిలో చికిత్స పొందుతున్న రవి, దామోదరం

తిరుపతి సిటీ, జనవరి 29 : రోడ్డుకడ్డంగా నిలిపి ఉన్న వాహనాన్ని పక్కకు తీయమని అడిగినందుకు గంజాయి మత్తులో ఉన్న కొందరు ఆకతాయిలు విద్యుత్తు కార్మికులపై విచక్షణారహితంగా దాడికి పాల్పడిన ఘటన రేణిగుంట పట్టణ సమీపంలోని జ్యోతినగర్‌లో సోమవారం చోటుచేసుకుంది.220 కేవీ సబ్‌స్టేషన్‌లో పనిచేసే కొందరు రేణిగుంట నుంచి చంద్రగిరి వరకు జాతీయ రహదారిపై ఉన్న విద్యుత్తు తీగలను తనిఖీ చేసి, విద్యుత్తు శాఖ వాహనంలో సాయంత్రం 4 గంటలకు సబ్‌స్టేషన్‌కు తిరిగివస్తున్నారు. జ్యోతినగర్ వద్దకు వచ్చేసరికి కొందరు ఆకతాయిలు రోడ్డుకు అడ్డంగా ద్విచక్ర వాహనాలను ఆపి ఉండటంతో పక్కకు తీసి దారివ్వాలని కోరారు. మమ్మల్నే వాహనాలు తీయమంటారా అంటూ పదిమంది ఆకతాయిలు ఒక్కసారిగా విద్యుత్తు కార్మికులపై విరుచుకుపడ్డారు. దొరికిన ఆయుధాలతో దాడికి పాల్పడ్డారు. అటుగా వెళుతున్న కొందరు వాహనదారులు అడ్డుకునేందుకు ప్రయత్నం చేయగా వారిపైనా దాడికి ప్రయత్నించారు. దాదాపు గంటకు పైగా వారు విద్యుత్తు కార్మికులపై దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో దామోదరం, రవి, శంకర్, ఉదయ్ కుమార్ తీవ్రంగా, శ్రీనివాసులు, కన్నయ్య, రమణ స్వల్పంగా గాయపడ్డారు. వీరిని 108 వాహనంలో రుయాస్పత్రికి తరలించారు. రవి, దామోదరం పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. దాడికి పాల్పడిన వారందరూ గంజాయి మత్తులో ఉన్నారని, అందరూ జ్యోతినగర్, గణేష్‌నగర్‌కు చెందిన యువకులేనని బాధితులు చెప్పారు. వారి ఫిర్యాదు మేరకు రేణిగుంట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, విధి నిర్వహణలో ఉన్న విద్యుత్తు కార్మికులపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ఉద్యోగ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.

ఎస్‌ఆర్వోలో సర్వర్ డౌన్

తిరుపతిలో ఆగిన రిజిస్ట్రేషన్లు

తిరుపతి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం (ఎస్‌ఆర్వో)లో సోమవారం సర్వర్ పనిచేయకపోవడంతో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. సరిచేయాల్సిన అధికారులు చేతులెత్తేయడంతో ఆస్తుల క్రయవిక్రయదారులు ఇబ్బందులు పడ్డారు. వారం రోజులుగా ఇదే పరిస్థితి కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. రిజిస్ట్రేషన్స్ శాఖలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విధానంపై అవగాహన లేకపోవడంతోనే రిజిస్ట్రేషన్స్ ప్రక్రియకు బ్రేకులు పడుతున్నాయని చెబుతున్నారు. సోమవారం కేవలం రెండు రిజిస్ట్రేషన్లు మాత్రమే జరిగాయంటే పరిస్థితి ఎలావుందో అర్థమవుతుంది. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే అమ్మకందారులు రిజిస్ట్రేషన్లు ఆగిపోవడంతో కొనుగోలుదారులతో గొడవలకు దిగుతున్నారు. రవాణా, వసతి ఖర్చులు చెల్లించాలని డిమాండు చేస్తున్నారు. సెంటిమెంటుగా మంచి రోజు అనుకుని వచ్చేవాళ్లకు నిరాశే మిగులుతోంది. స్టాంపు డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజులు చెల్లించినప్పటికీ సేవలలో లోపం కారణంగా కొనుగోలుదారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

వైసీపీ తీరు రెడ్ల వర్గానికే కళంకం

టీడీపీ నేత సుధీర్‌రెడ్డి



శ్రీకాళహస్తి, జనవరి 29:వైసీపీ తీరు రెడ్ల సామాజిక వర్గానికే తీవ్ర కళంకంగా మారిందని టీడీపీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇంచార్జి బొజ్జల సుధీర్ రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ...వైసీపీలో పైన జగన్ రెడ్డి, విజయసాయిరెడ్డి,పెద్దిరెడ్డి దగ్గర నుంచి కింద మధుసూదన రెడ్డి వరకు వ్యవహరిస్తున్న తీరు చూస్తుంటే తనకు రెడ్డిగా ఎందుకు పుట్టాననే ఆవేదన కలుగుతోందన్నారు.రు.చిత్తూరు టికెట్‌ను ఏకంగా ఎర్రచందనం స్మగ్లర్ విజయానంద రెడ్డికి ఇవ్వడం దారుణమన్నారు.శ్రీకాళహస్తిలో ఎమ్మెల్యే మధుసూదన రెడ్డి భూ అరాచకాలకు అంతేలేకుండా పోతోందన్నారు. రేణిగుంటలో ప్రభుత్వ భూముల రికార్డులను తారుమారు చేసి వెంచర్లు వేసి అమ్ముకుంటున్నారని ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు.టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గురవారెడ్డి,కోడూరు బాలసుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్‌ఆర్‌ఐ డాక్టర్ మల్లం మోహన్‌రెడ్డి

చంద్రగిరి, జనవరి 29: తొండవాడలో నిర్వహిస్తున్న కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎన్‌ఆర్‌ఐ డాక్టర్ మల్లం మోహన్‌రెడ్డి, మల్లం పద్మ దంపతులు కోరారు. సోమవారం వారు మీడియాతో మాట్లాడుతూ ఫిబ్రవరి 1వ తేది వరకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు 385 మందికి పరీక్షలు నిర్వహించి 46 మందికి ఆపరేషన్లు చేసినట్లు తెలిపారు. మరో 60 మందిని చెన్నైలోని జేసీవోసీ ఆసుపత్రికి సిఫార్సు చేసినట్లు వెల్లడించారు. సింగిల్ విండో ఛైర్మన్ మల్లం చంద్రమౌళిరెడ్డి, సర్పంచ్ మల్లం దీపికా రెడ్డి, వైస్‌ఎంపీపీ నిరంజన్‌రెడ్డి, ఉపసర్పంచ్ సుధాకర్‌రెడ్డి, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల అడ్డగింత



ద్వారకానగర్‌లో అక్రమ నిర్మాణాలు

చంద్రగిరి, జనవరి 29: చంద్రగిరి ద్వారకానగర్‌లో అక్రమ నిర్మాణాలు చేపడుతుంటే రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. సర్వే నెంబరు 143లో తిరుపతి రూరల్ మండలం సి.మల్లవరానికి చెందిన ఓ వ్యక్తి అక్రమ నిర్మాణాలు చేపడుతుండగా సమాచారం అందుకున్న రెవెన్యూ అధికారులు వచ్చి నిర్మాణాలు నిలిపివేయాలన్నారు. రెవెన్యూ అధికారులు వెళ్ళిపోయిన తరువాత మళ్ళీ నిర్మాణాలు చేపట్టడంతో స్థానికులు డయల్ 100 ఫోన్ చేసి సమాచారం అందించారు. దీంతో స్థానికులు, నిర్మాణాలు చేపడుతున్న వారి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. స్థానికులు మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు వచ్చి సర్వే చేసేవరకు తాత్కాలికంగా పనులు నిలిపివేయాలన్నారు.

సొంత స్థలాల్లో ఫ్లెక్సీలు, బ్యానర్లకు అనుమతివ్వండి

టీడీపీ నేత పులివర్తి నాని



ఎంపీడీవోకు వినతిపత్రాన్ని అందజేస్తున్న పులివర్తి నాని

చంద్రగిరి, జనవరి 29: చంద్రగిరి మండలంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు తమ సొంత స్థలాల్లో పార్టీకి చెందిన ఫ్లెక్సీలు, బ్యానర్లు పెట్టుకోవడానికి అనుమతి ఇవ్వాలని ఎంపీడీవో బాలాజినాయక్‌కు సోమవారం చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు పులివర్తి నాని వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రమణ్యం నాయుడు, నాయకులు గౌస్‌బాషా, కొండూరు ప్రవీణ్, బాలకృష్ణమూర్తి, రమేష్‌రెడ్డి, పులికంటి మోహన్‌రెడ్డి, తులసేశ్వరరెడ్డి, డిష్ గోపి, రాజులగారి వినోద్, గురుమూర్తిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పాత్రికేయుల షెడ్లు కూలదోసిన వారిపై చర్యలు తీసుకోవాలి : నాని

చంద్రగిరి, జనవరి 29: చంద్రగిరి మండల పాత్రికేయులకు చెందిన షెడ్లను కూలదోసిన వారిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని టీడీపీ నేత పులివర్తి నాని డిమాండ్ చేశారు. అగరాలలోని సర్వే నెంబరు 358లో కొంతమంది పాత్రికేయులు నిర్మాణాలు చేపట్టారు. అయితే గుర్తుతెలియని వ్యక్తులు వాటిని కూలదోయడంతో పులివర్తి నాని సోమవారం ఆ స్థలానికి వచ్చి పరిశీలించారు. పాత్రికేయులు సుమారు ఐదారు లక్షల రూపాయల ఖర్చుతో స్థలాన్ని శుభ్రం చేసిన తరువాత రెవెన్యూ అధికారులు బోర్డు పాతడం,పాత్రికేయుల నిర్మాణాలను కొంతమంది కూలదోయడం దురదృష్టకరమన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే ఆరు నెలల్లోనే పాత్రికేయులకు ఇంటి స్థలాలు ఇచ్చి, ఎన్టీఆర్ హౌసింగ్ ద్వారాగానీ, టిడ్కో ఇళ్ళు గానీ నిర్మించి ఇస్తామని తెలిపారు.

అనర్హుల ఓట్లు తొలగించండి

భాకరాపేట, జనవరి 29: ఓటర్ల జాబితాలో అనర్హుల ఓట్లు తొలగించాలని టీడీపీ మండల అధ్యక్షుడు బెల్లంకొండ మురళి ఆధ్వర్యంలో డిప్యూటీ తహసీల్దారు అన్వర్ బాషాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని పలు పోలింగ్ బూత్‌ల పరిధిలో మరణించిన, డబుల్ ఎంట్రీలు, వలస వెళ్లిపోయిన వారి ఓట్లు కూడా పునరావృతం అయ్యాయని, వాటిని తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మదనమోహన, ఆర్వీ రమణారెడ్డి, సుబ్రహ్మణ్యం, వెంకటరత్నం, విజయశేఖర్ గౌడ్, చంద్రశేఖర్, మల్లికార్జున రెడ్డి, గురుమూర్తి, సహదేవరెడ్డి, డిష్ మణి, రమేశ్ రెడ్డి, కృష్ణారెడ్డి, వెంకటనాగిరెడ్డి, రాజగోపాల నాయుడు, ఎర్రయ్య నాయుడు, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాలినడకన తిరుమలకు తమిళ భక్తులు

రామచంద్రాపురం, జనవరి 29 : ఏడుకొండల వాడా.. వెంకటరమణ.. గోవింద... గోవిందా అంటూ తమిళనాడు రాష్ట్రం షోలింగర్, చెంగి, ఆర్కే పేట ప్రాంతాల నుంచి 350మంది తమిళ భక్తులు గోవిందమాల ధరించి తిరుమలకు కాలినడకన బయలుదేరి వెళ్లారు. షోలింగర్ నుంచి శుక్రవారం ఇరుముడితో తిరుమలకు కాలినడకన బయలుదేరి రాయల చెరువుపేట భవానీ జలకంఠేశ్వర స్వామి ఆలయం వద్దకు సోమవారం ఉదయం చేరుకున్నారు. అక్కడ స్వామి అమ్మవార్లను దర్శించుకుని మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. తర్వాత భజనలు చేసుకుంటూ తిరుమలకు బయలు దేరారు. కాగా రహదారిలో నిత్యం భక్తులు తిరుమలకు వస్తుంటారు. అందువల్ల ఆర్‌సీపురం మండల సరిహద్దు ప్రాంతంలో వసతి ఏర్పాటు చేయాలని తమిళ భక్తులు కోరుతున్నారు.

శ్మశానం, రోడ్డు ఏర్పాటు చేయాలని వినతి

తిరుచానూరు, జనవరి 28: తిరుపతి గ్రామీణ మండలం వేమూరు గ్రామానికి చెందిన 40మంది ముస్లిం కుటుంబాలకు సంబంధించి శ్మశానం, రోడ్డు ఏర్పాటు చేయాలని స్థానిక ఎంపీటీసీ యోగానందరెడ్డి కోరారు. ఈ మేరకు ఆయన స్థానికులతో కలిసి తుడా ఛైర్మన్ మోహిత్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. తహసీల్దారుతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం తహసీల్దారు సుబ్రహ్మణ్యంను కలిసి వినతిపత్రం అందజేశారు.

కార్మికులే జగన్ ప్రభుత్వాన్ని కూల్చేస్తారు



టీడీపీ జెండాను ఆవిష్కరించిన రఘురామరాజు తదితరులు

తిరుపతి (రవాణా), జనవరి 29: కార్మికులే జగన్ ప్రభుత్వాన్ని కూల్చేస్తారని టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కల రఘురామరాజు అన్నారు. మంగళంలో సోమవారం టీఎన్‌టీయూసీ జిల్లా నాయకుడు అమిలినేని మధు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్మిక చైతన్య యాత్రలో ఆయన పాల్గొన్నారు. తెలుగుదేశం పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం కార్మికుల పట్ల చిన్నచూపు చూసిందన్నారు. న్యాయం చేయాలని కార్మికులు రోడ్డెక్కితే జైళ్ల పాలు చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దొంగ ఓట్లతో గెలవాలని చూస్తున్న చెవిరెడ్డికి ప్రజలంతా ఏకమై బుద్ధి చెప్పాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అంజూరు సింధుజ, మాధవనాయుడు, సుబ్రహ్మణ్యం, జయరామ్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, ఈశ్వరయ్య, గోపీనాథ్, సురేష్‌నాయుడు, పెరుగు భాస్కర్‌రెడ్డి, భానుప్రతాప్ రెడ్డి, జనసేన నాయకులు కిషోర్ రాయల్, నవీన్, సాయి, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.



డీజీ కమెండేషన్ డిస్క్ అవార్డు పొందిన ట్రాఫిక్ ఏఎస్ఐ రాజారావును సత్కరిస్తున్న తిరుపతి ట్రావెల్స్ అసోసియేషన్ సభ్యులు

చంద్రగిరి

టీడీపీ బీసీ గర్జనకు జోరుగా ఏర్పాట్లు

ఎర్రావారిపాలెం, జనవరి 29 : ఈనెల 31న ఎర్రావారిపాలెంలో జరగనున్న టీడీపీ బీసీ గర్జన మహాసభకు ఏర్పాట్లు జోరుగా జరుగుతున్నాయి. తలకోన రోడ్డులోని సంత గేటుకు ఎదురుగా నున్నబేరిపల్లె రోడ్డుకు ఆనుకున్న మైదానంలో బీసీ గర్జన మహాసభ వేదికను సిద్ధం చేస్తున్నారు. ఈ ఏర్పాట్లలో జిల్లా టీడీపీ కార్యదర్శి అన్నాసముద్రం మధు సూదన్, ఎర్రావారిపాలెం, చిన్నగొట్టిగల్లు మండలాల పార్టీ అధ్యక్షులు దేశిరెడ్డి రఘునాథ, బెల్లం కొండ మురళి, ప్రధాన కార్యదర్శి మహేష్ నాయుడు, మదన్‌మోహన్, బొగ్గటి కృష్ణమూర్తి, హరిశ్చంద్ర, ఒబిలి విశ్వనాథరెడ్డి, జయపాల్ రెడ్డి, రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి మౌలాలి, సహదేవ రెడ్డి, మురళి, లక్ష్మీదేవి, దేవి, గోపి, శ్రీనివాసులు, వెంకట్రామయ్య తదితరులు పర్యవేక్షించారు.

భవిత కేంద్రానికి వీల్‌చైర్ వితరణ

తిరుపతి(విద్య), జనవరి 29 : బైరాగిపట్టెడ ఎంజీఎం స్కూల్ ప్రాంగణంలో ఉన్న భవిత కేంద్రానికి లయన్స్ క్లబ్ ఆఫ్ తిరుపతి గరుడాద్రి సంస్థ ప్రతినిధులు సోమవారం వీల్‌చైర్, నోటుపుస్తకాలు, స్టేషనరీ వితరణ చేశారు. ఈ కేంద్రంలో ఒకటవ తరగతి చదివే విద్యార్థి భార్గవ్‌కి ఎంఈవోలు బాలాజి, భాస్కర్‌నాయక్, హెచ్‌ఎం మురుగన్‌లతో క్లబ్ అధ్యక్షుడు ఎం.భాస్కర్ కలసి వీల్‌చైర్‌ని అందించారు. భాస్కర్ మాట్లాడుతూ అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఇందులో భాగంగా భవిత కేంద్రానికి రూ.13వేల విలువచేసే వస్తువులను అందించామని తెలిపారు. జాయింట్ సెక్రటరీ శంకర్, కోశాధికారి చక్రపాణి, సభ్యులు బండి మధుసూదన్‌రెడ్డి, సుకుమార్, టీచర్లు భవాని, జ్ఞానమ్మ తదితరులు పాల్గొన్నారు.

నరసింగాపురంలో గడప గడపకు

చంద్రగిరి, జనవరి 29: చంద్రగిరి మండలం నరసింగాపురంలో సోమవారం గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ హేమేంద్రకుమార్‌రెడ్డి, జడ్పీటీసీ యుగంధర్‌రెడ్డి, సర్పంచ్ చెంచురత్నం, ఎంపీటీసీ అశ్వనీప్రవీణ్‌కుమార్, ఉపసర్పంచ్ రాజేంద్రప్రసాద్, ఔరంగజేబు,చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి పాల్గొన్నారు.

అటవీ కార్మికులకు న్యాయం చేయకుంటే రాష్ట్రవ్యాప్త ఉద్యమం

సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు





కార్మికులనుద్దేశించి ప్రసంగిస్తున్న నర్సింగరావు - మద్దతు తెలిపిన టీడీపీ నేతలు

తిరుపతి(కొర్లగుంట), జనవరి 29 : నగరంలో 1,160 రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్న టీటీడీ అటవీ కార్మికులకు న్యాయం చేయకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు హెచ్చరించారు. మూడు రోజులుగా జరుగుతున్న ఆమరణ నిరాహార దీక్ష శిబిరాన్ని ఆయన సోమవారం సందర్శించి, మాట్లాడారు. జూనియర్లను పర్మినెంట్ చేసి సీనియర్లకు అన్యాయం చేయడం న్యాయ సూత్రాలకు విరుద్ధమన్నారు. సీఎం జగన్ పాలన కార్మికులకు వ్యతిరేకంగా తయారైందని దుయ్యబట్టారు. ధార్మిక సంస్థ టీటీడీలోనూ ఈ ధోరణులు పెరిగిపోయాయని విమర్శించారు. తిరుమల పచ్చదనానికి కారకులైన అటవీ కార్మికుల పట్ల టీటీడీ యాజమాన్యం మొండివైఖరిని సమాజం యావత్తు ఏవగించుకునేటట్లు ఉందని గుర్తు చేశారు. 30సంవత్సరాల పాటు సేవలందించిన కార్మికుల్లో అత్యధికులు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని, 12మంది మరణించారని, అయినా టీటీడీకి కనికరం లేదని వాపోయారు. టీటీడీ ఛైర్మన్ ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. జూనియర్లను పర్మినెంట్ చేయడం వెనుక ఉన్న మతలబు ఏంటో బయటపెట్టాలన్నారు. టీడీపీ తిరుపతి పార్లమెంట్ అధ్యక్షుడు నరసింహయాదవ్, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, టీడీపీ నేతలు దంపూరి భాస్కర్ యాదవ్, ఓ.వి.రమణ, టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గొట్టిముక్కల రఘురామకృష్ణంరాజు, ఆర్.పి.ఐ దక్షిణ భారత అధ్యక్షులు పూతలపట్టు అంజయ్య, కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దొడ్డారెడ్డి రాంభూపాల్‌రెడ్డి, చిట్టిబాబు కందారపు మురళికి పూలమాలలు వేసి, సంఘీభావం ప్రకటించారు. ఆలిండియా లాయర్స్ యూనియన్ ఆధ్వర్యంలో న్యాయవాదుల సంఘం రాష్ట్ర కార్యదర్శి దేవరాజులు, పత్తికొండ మురళి, నేతాజీ, వెంకటయ్య, ప్రసన్న, ఉషాకిరణ్ మద్దతు పలికారు. బీఆర్‌ఎస్ నేత ఆర్కాట్ కృష్ణప్రసాద్, ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్ జిల్లా కార్యదర్శి ఈఎస్.కుమార్, భాస్కర్, ఎన్.వి.కె.రెడ్డి, ఏపీ రజక వృత్తిదారుల సంఘం అధ్యక్షుడు మునిరత్నం, భాస్కర్, లోక, ఐద్వా జిల్లా కార్యదర్శి పి.సాయిలక్ష్మి, ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.హేమలత, ఎల్‌ఐసీ యూనియన్ ప్రతినిధులు వెంకటముని, కృష్ణకుమార్ పాల్గొని సంఘీభావం తెలిపారు. కాగా, ఆమరణ దీక్షకు పూనుకున్న నేతలు, కార్మికుల ఆరోగ్యం పరిస్థితి సోమవారం రాత్రికి మరింత క్షీణించిందని రుయా ఆసుపత్రి వైద్యురాలు హారిక ప్రకటించారు.

దీక్ష భగ్నం

- నాయకుల అరెస్ట్, రుయాకు తరలింపు
- అడ్డుకునేందుకు కార్మికుల యత్నం...తోపులాట

తిరుపతి(నేరవిభాగం), జనవరి 29: అటవీ కార్మికుల ఆమరణ నిరాహార దీక్షను పోలీసులు సోమవారం రాత్రి భగ్నం చేశారు. తమను పర్మినెంట్ చేయాలనే డిమాండ్‌తో సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు మూడు రోజులుగా ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్నారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శితో పాటు, కృష్ణమూర్తి తదితర కార్మికులు నిరాహార దీక్షలో ఉన్నారు. వారి ఆరోగ్యం విషమిస్తోందని వైద్య బృందం చెప్పడంతో పోలీసులు సోమవారం రాత్రి 10 గంటల సమయంలో దీక్షను భగ్నం చేశారు. అలిపిరి సీఐ అబ్బన్న, ఎస్‌ఐ రాజశేఖర్‌రెడ్డి స్పెషల్ పార్టీ పోలీసులతో దీక్షా శిబిరం వద్దకు చేరుకుని కందారపు మురళి, కృష్ణమూర్తితో చర్చించి ఆస్పత్రికి రావాలని కోరారు. వారు తిరస్కరించడంతో బలవంతంగా అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించారు. పోలీసుల యత్నాన్ని కార్మికులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులకు, కార్మికులకు మధ్య తోపులాట చోటుచేసుకుంది. ఎట్టకేలకు కందారపు మురళితో పాటు మరో ఎనిమిది మంది నాయకులను, కార్మికులను అదుపులోకి తీసుకుని పోలీసు వాహనంలో రుయా ఆసుపత్రికి తరలించి, వైద్య సేవలందించారు.





పోలీసులను అడ్డుకుంటున్న కార్మికులు - నాయకులను వ్యానులో తరలిస్తున్న పోలీసులు

చిత్తూరు ఎస్పీగా జాషువా

- కౌంటర్ ఇంటెలిజెన్సు సెల్ ఎస్పీగా రిషాంత్‌రెడ్డి.. తిరుపతి టాస్క్‌ఫోర్సు అదనపు బాధ్యతలు కూడా



చిత్తూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): సాధారణ ఎన్నికల నేపథ్యంలో చిత్తూరు ఎస్పీ రిషాంత్‌రెడ్డి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కొత్త ఎస్పీగా జాషువా రానున్నారు. ఈ మేరకు సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ అయ్యాయి. జిల్లాల పునర్విభజన తర్వాత చిత్తూరు ఎస్పీగా రిషాంత్‌రెడ్డి 2022 ఏప్రిల్‌లో బాధ్యతలు చేపట్టారు. సుమారు 22 నెలల పాటు పనిచేసిన ఆయన.. అంతకుముందు ఎస్‌ఈబీ ఏఎస్పీగా కూడా పనిచేశారు. జూన్ ఒకటో తేదికి రిషాంత్‌రెడ్డి ఎస్పీగా, ఏఎస్పీగా మూడేళ్లు పూర్తి కానున్న నేపథ్యంలో ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ఆయనకు బదిలీ తప్పలేదు. కౌంటర్ ఇంటెలిజెన్సు (సీఐ) విభాగ ఎస్పీగా రెగ్యులర్‌గా, తిరుపతి ఎర్రచందనం టాస్క్‌ఫోర్స్ ఎస్పీగా అదనపు బాధ్యతల్ని ఈయనకు ప్రభుత్వం అప్పగించింది.

నాడు పలమనేరు డీఎస్పీ.. నేడు ఎస్పీ

ప్రస్తుతం కృష్ణా జిల్లా ఎస్పీగా పనిచేస్తున్న జాషువా జిల్లాకు బదిలీ అయ్యారు. 2009 గ్రూప్-1 బ్యాచ్‌కు చెందిన ఈయన 2016 బ్యాచ్ ఐపీఎస్‌గా పరిగణించబడుతున్నారు. తిరుపతి ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి, ఈయన ఒకే గ్రూప్-1 బ్యాచ్ అధికారులు. 2012-13 మధ్యకాలంలో జాషువా పలమనేరు డీఎస్పీగా పనిచేశారు. తల్లిదండ్రులది విజయవాడ అయినప్పటికీ, ఆయన పుట్టి పెరిగిందంతా హైదరాబాదులోనే.

పలు వివాదాల్లో రిషాంత్‌రెడ్డి



బదిలీ అయిన ఎస్పీ రిషాంత్‌రెడ్డి అధికార పార్టీకి అనుకూలంగా పనిచేస్తున్నారనే ఆరోపణలు ప్రతిపక్షాల నుంచి బలంగా ఎదుర్కొన్నారు. గతేడాది జనవరి 4వ తేదీన చంద్రబాబు కుప్పంలో పర్యటించకుండా ప్రభుత్వ జీవో 1 పేరుతో పోలీసులు అడ్డుకున్నారు. ఆయన ప్రచార రథం సీజ్ చేయడంతో పాటు సభలు ఏర్పాటు చేయకుండా అడ్డుకోవడంతో నియోజకవర్గమంతా రథం లేకుండానే మాట్లాడారు. రోడ్లపై కింద కూర్చొని నిరసన తెలిపారు. అలాగే, లోకేశ్ యువగళం పాదయాత్రను జనవరి 27న కుప్పం నుంచి ప్రారంభించగా అనుమతులు ఇవ్వడంలో ఇబ్బందులు పెట్టారు. పాదయాత్ర సాగినన్ని రోజులూ నిత్యం కేసులు పెడుతూ పోలీసులు అడ్డుపడ్డారు. గతేడాది ఆగస్టులో చంద్రబాబు పుంగనూరులో పర్యటించకుండా పోలీసులు అడ్డుకోవడం, టీడీపీ శ్రేణులు తిరగబడటంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగిన విషయం తెలిసిందే. ఈ ఘటన నేపథ్యంలో పుంగనూరు నియోజకవర్గంతో పాటు జిల్లాలోని మిగిలిన ప్రాంతాల నాయకులు, కార్యకర్తలు సుమారు 600 మందిపై హత్యాయత్నం కేసులు పెట్టి జైలుకు పంపించారు. కుప్పం నియోజకవర్గంలోనూ మహిళా నేతలు సహా అత్యధికంగా నేతలు, కార్యకర్తల మీద హత్యాయత్నం కేసులు నమోదయ్యాయి. వీటన్నింటికీ ఎస్పీ రిషాంత్‌రెడ్డినే కారణమని టీడీపీ నాయకులు అనేకమార్లు ఆరోపించారు. లోకేశ్ అయితే జిల్లా దాటిన తర్వాత కూడా ఎస్పీ రిషాంత్‌రెడ్డి గురించి పలు మార్లు వ్యతిరేకంగా మాట్లాడారు.

సైబర్ నేరాల బారినపడితే 1930కు కాల్ చేయండి

- ఇంటర్నెట్‌లో వ్యక్తిగత సమాచారం షేర్ చేయొద్దు
- బ్యాంకింగ్ కార్యకలాపాల్లో అప్రమత్తంగా ఉండాలి
- సీఐడీ అధికారులు, సైబర్ నిపుణులు



జ్యోతి ప్రజ్వలనతో సదస్సును ప్రారంభిస్తున్న ముఖ్య అతిథులు

తిరుపతి(నేరవిభాగం), జనవరి 29: ఎవరైనా సైబర్ నేరాల బారినపడితే తక్షణం హెల్ప్‌లైన్ నంబర్ 1930కి కాల్ చేయాలని సీఐడీ ఎస్పీ ఎంవీఎస్ స్వామి సూచించారు. సైబర్ నేరాలు, నియంత్రణ, నివారణపై చైతన్య సదస్సులు స్థానిక ఎస్వీయూ సెనెట్ హాల్లో సోమవారం నిర్వహించారు. సీఐడీ ఆధ్వర్యంలో రెండు దఫాలుగా జరిగిన ఈ సదస్సులకు ఎస్వీయూ వీసీ వి.శ్రీకాంత్‌రెడ్డి అధ్యక్షుడిగా వ్యవహరించారు. ఇతర అతిథులతో కలిసి జ్యోతి ప్రజలన చేసి ఆయన సదస్సును ప్రారంభించారు. సీఐడీ ఎస్పీ ఎంవీఎస్ స్వామి మాట్లాడుతూ మొబైల్, ఇంటర్నెట్, సోషల్ మీడియా ప్లాట్‌ఫాంల వినియోగంపై అవగాహన పెంపొందించుకుని జాగ్రత్తలు పాటిస్తే సైబర్ నేరాల బారినపడే ప్రమాదం ఉండదన్నారు. అవగాహన కల్పించేందుకే సీఐడీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు వివరించారు. దీనికిముందు సభాధ్యక్షులుగా ఎస్వీయూ వీసీ శ్రీకాంత్‌రెడ్డి, ఇన్ఫోసెక్ ఎన్ కంప్లయన్స్ సొల్యూషన్స్ (ఐఎస్ఎన్‌సీఎస్) డైరెక్టర్ రవిశంకర్ మాట్లాడుతూ సులభంగా డబ్బు సంపాదించేందుకు కొంతమంది అమాయక ప్రజల అవగాహనాలేమిని ఆసరా చేసుకుని సైబర్ నేరాలతో మోసగిస్తున్నా రన్నారు. మంగళగిరి సీఐడీ సైబర్‌సెల్ సెక్యూరిటీ నిపుణులు ఐఎల్ నరసింహారావు జాగ్రత్తల గురించి వివరించారు. వ్యక్తిగత సమాచారాన్ని ఎవరితోనూ పంచుకోవద్దని, ఓటీపీలను చెప్పవద్దని, ముఖ్యంగా బ్యాంకింగ్ వ్యవహారాల్లో అత్యంత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ సదస్సుల్లో సీఐడీ డీఎస్పీలు ఎ.పద్మలత, పి.శంకర్, కె.రసూల్ సాహెబ్, నెల్లూరు సీఐడీ డీఎస్పీ కె.వేణుగోపాల్, ఇతర అధికారులు రామకిషోర్, ఎంవీ రమణ, ఎం.రవినాయక్ పాల్గొన్నారు.

టీటీడీలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి జీతాల పెంపు

తిరుమల, జనవరి 29(ఆంధ్రజ్యోతి) టీటీడీలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి వేతనాలను పెంచామని ఛైర్మన్ కరుణాకర రెడ్డి తెలిపారు. సోమవారం జరిగిన బోర్డు సమావేశ నిర్ణయాలను ఆయన మీడియాకు వివరించారు.టీటీడీ పోటు విభాగంలో 70మంది కాంట్రాక్ట్ లడ్డూ ట్రే లిఫ్టింగ్ సెమీ స్కిల్డ్, అన్‌స్కిల్డ్ కార్మికులను స్కిల్డ్ కార్మికులుగా మార్పు చేసి వారి వేతనాలను రూ.12,523 నుంచి రూ.15 వేలకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నామన్నారు.అన్నదాన విభాగంలో 138మంది క్లీనర్లను, 79మంది వంట మనుషులను స్కిల్డ్ కేటగిరిలోకి మార్చి వేతనాలను రూ.17 వేల నుంచి రూ.22 వేలకు పెంచామన్నారు. ఎలక్ట్రికల్, వాటర్ వర్క్స్ విభాగాల్లో పనిచేసే కార్మికులను అన్‌స్కిల్డ్ నుంచి స్కిల్డ్ కేటగిరీలోకి మార్చామన్నారు.ఎస్వీ శిల్పకళాశాలలో శిల్పుల వేతనాల పెంపుదలకు ఆమోదం తెలిపామన్నారు. కలంకారి కళలో నిపుణులైన మునస్వామిరెడ్డి వేతనం రూ.25వేల నుంచి రూ.39 వేలకు పెంచామన్నారు.టీటీడీ అనుబంధ, విలీన ఆలయాల్లో కాంట్రాక్ట్ అర్చకుల, సంభావన అర్చకుల వేతనాలను రూ.26వేల నుంచి రూ.31 వేలకు పెంచామన్నారు. టీటీడీ స్టోర్‌లో చాలాకాలంనుంచి పనిచేస్తున్న 9మంది వర్కర్లకు రూ.9 వేల నుంచి రూ.15 వేలకు జీతం పెంచుతూ నిర్ణయించామన్నారు. ఎస్వీ ఉన్నత వేదాధ్యయన సంస్థ ద్వారా సేవలందిస్తున్న క్రమాపాఠీలకు రూ.16 వేల నుంచి రూ.22 వేలకు, ఘనాపాఠీలకు రూ.17 వేల నుంచి రూ.25 వేలకు సంభావన పెంచామన్నారు.రూ.1,400 మంది వేదపారాయణదారులకు పెన్షన్‌ను రూ.10 వేల నుంచి రూ.12 వేలకు పెంచామన్నారు.టీటీడీ ఆధ్వర్యంలోని ఆరు వేద పాఠశాలల్లో 51మంది సంభావన అధ్యాపకుల వేతనాలను రూ.35 వేల నుంచి రూ.54 వేలకు పెంచుతూ ఆమోదం తెలిపామన్నారు. భక్తుల సౌకర్యార్థం రూ.2.28 కోట్లతో తిరుమలలోని సప్తగిరి సత్రాలు 6, 7 బ్లాకుల అభివృద్ధి పనుల కోసం టెండరు ఖరారు చేశామన్నారు. శ్రీవేంకటేశ్వర, ఆదిశేష, శంకుమిట్ట విశ్రాంతి గృహాల అభివృద్ధి, పెయింటింగ్ పనుల కోసం రూ.10.90 కోట్ల మంజూరుకు ఆమోదం తెలిపామన్నారు.తిరుమలలోని అన్నమయ్య భవన సమావేశ మందిరం ఆధునికీకరణలో భాగంగా దృశ్యశ్రవణ అనుసంధాన పరికరాల ఏర్పాటుకు ఆమోదించామన్నారు. టీటీడీ ఉద్యోగుల ఇళ్లస్థలాల కోసం వడమాలపేట మండలం పాదిరేడు అరణ్యం వద్ద అదనంగా కేటాయించిన 132.05ఎకరాల స్థలంలో గ్రావెల్ రోడ్డు ఏర్పాటుకు ఆమోదం తెలిపామన్నారు. త్వరలో మిగిలిన ఉద్యోగులకు కూడా ఇళ్లస్థలాలను కేటాయిస్తామన్నారు. శ్రీవాణిట్రస్టుపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో తిరుపతి, తిరుమల విలేకరులతో ఏర్పాటైన శ్రీవాణిట్రస్టు నిజనిర్ధారణ కమిటీ తన క్షేత్రస్థాయి పరిశీలనతో రూపొందించిన నివేదికను ఈ సందర్భంగా టీటీడీకి అందజేసింది.తిరుపతి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు భాస్కరరెడ్డి మిగిలిన కమిటీ సభ్యులతో కలిసి నివేదికను అందజేశారు.

ఏపీఈఆర్సీకి మూడు ఫిర్యాదులు

తిరుపతి(ఆటోనగర్) జనవరి 29 : రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి చేపట్టిన విద్యుత్ వినియోగదారుల బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణకు మొదటి రోజు సోమవారం ముగ్గురు వ్యక్తులు సమస్యలను ఛైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. తిరుపతి సర్కిల్ పరిధి పుత్తూరు డివిజన్ కేంద్రంలో ఆన్‌లైన్ విధానంలో జరిగిన అభిప్రాయ సేకరణలో కార్వేటినగరానికి చెందిన ముగ్గురు హాజరయ్యారు. ఎస్.పర్వేజ్ మాట్లాడుతూ సున్నా నుంచి వంద యూనిట్ల వరకు ఒక స్లాబ్‌గా నిర్ణయించాలని కోరారు. ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలని సమీరుద్దీన్ కోరారు. కార్వేటినగరంలో 24 గంటలు నీటి సరఫరా మోటర్లు నడుస్తున్నాయని, అవసరం మేరకే వినియోగించాలని కేశవరాజు కోరారు. అదేవిధంగా త్రీస్టార్ కంపెనీల పరికరాలను వాడాలని, సెక్షన్ కేంద్రాల సమీపంలో దుకాణాలు నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో పుత్తూరు ఈఈ చిన్నరెడ్డెప్ప, కార్వేటినగరం డిప్యూటీ ఈఈ నాగరాజు, ఏఈలు పాల్గొన్నారు.

జూకు కొత్త జంతువుల రాక





కొత్తగా వచ్చిన జంతువులు - జంతువులను జూకు తరరలిస్తున్న సిబ్బంది

తిరుపతి అర్బన్, జనవరి 29: తిరుపతి శ్రీవెంకటేశ్వర జంతు ప్రదర్శనశాలకు సోమవారం కొత్త జంతువులు వచ్చాయి. ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాంలో భాగంగా ఛత్తీస్‌గఢ్ బిలాస్‌పురం కానన్ పెండారి జులాజికల్ గార్డెన్ నుంచి ఒక జత నక్కలు, రెండు జతల థామిన్ జింకలు, మూడు జతల అడవి జింకలను తీసుకువచ్చినట్లు క్యూరేటర్ సెల్వం తెలిపారు. జంతువులు ఆరోగ్యంగా ఉన్నాయని, వాటిని డాక్టర్ల పర్యవేక్షణలో ఉంచామని తెలిపారు.

నేడు సర్పంచుల నిరసన దీక్ష

తిరుపతి(తిలక్‌రోడ్), జనవరి 29: పంచాయతీల నిధులను బదలాయించుకుంటూ మోసం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి కనువిప్పు కలగాలని సర్పంచులు మంగళవారం నిరసన దీక్ష చేస్తున్నట్లు పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగంశెట్టి సుబ్బరామయ్య తెలిపారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ 73, 74 రాజ్యాంగ సవరణలోని ఆర్టికల్ 243 జి 11షెడ్యూల్‌లో పేర్కొన్న 29 అంశాల్లోని నిధులు, విధులు, అధికారాలను స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులైన సర్పంచులు, ఎంపీటీసీ, జడ్పీటీసీ, ఎంపీపీ, జిల్లా పరిషత్ ఛైర్మన్లకు బదలాయించి, పంచాయతీలను బలోపేతం చేయాలని కోరారు. సర్పంచుల 16 డిమాండ్లను తక్షణం పరిష్కరించాలని కోరారు. ఈ మేరకు మంగళవారం పాత మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన దీక్షలు చేస్తున్నట్లు చెప్పారు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర కార్యదర్శి కిరణ్‌యాదవ్, రవి పాల్గొన్నారు.

సిద్ధార్థ లాజిస్టిక్స్ పరిశ్రమకు అవార్డు



అవార్డు స్వీకరిస్తున్న నవీన్‌కుమార్

శ్రీసిటీ, జనవరి 29: అంతర్జాతీయ కస్టమ్స్ డే సందర్భంగా, విజయవాడలోని కస్టమ్ ప్రివెంటివ్ కమిషనరేట్ కార్యాలయం వారు శ్రీసిటీకి చెందిన సిద్ధార్థ లాజిస్టిక్స్ ప్రైవేటు లిమిటెడ్ పరిశ్రమకు ఉత్తమ దిగుమతిదారు అవార్డు అందజేశారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో పనితీరు ఆధారంగా ఈ ఎంపిక జరగగా ఈ నెల 27న కాకినాడలో జరిగిన కార్యక్రమంలో కస్టమ్స్, సెంట్రల్ పన్నుల చీఫ్ కమిషనర్ నుంచి సిద్ధార్థ కంపెనీ జనరల్ మేనేజర్ నవీన్‌కుమార్ అవార్డును అందుకున్నారు. సిద్ధార్థ లాజిస్టిక్స్ ఈ ప్రతిష్టాత్మక అవార్డును అందుకోవడం ఇది వరుసగా రెండవ సంవత్సరం కావడం విశేషం.తమ సిబ్బంది అత్యుత్తమ పనితీరు, సమిష్టి కృషికి గుర్తింపుగా ఈ అవార్డు దక్కిందని సిద్ధార్థ లాజిస్టిక్స్ మేనేజింగ్ డైరెక్టర్ నిశ్చల్ పాధ్య అన్నారు.

సిపాయికి పలువురి శుభాకాంక్షలు



రోగులకు స్వీట్లు పంచి పెడుతున్న డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం

తిరుపతి సిటీ, జనవరి 29 : రష్ ఆస్పత్రి అధినేత, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం 65వ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని పలువురు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం రష్ ఆస్పత్రిలో మేయర్ డాక్టర్ శిరీషా, రాష్ట్ర వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ భరత్‌కుమార్‌రెడ్డితో పాటు పలువురు డాక్టర్లు, వైసీపీ నేతలు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి, శాలువాలతో సత్కరించారు. అనంతరం ఆస్పత్రి సిబ్బందితో కలిసి కేక్ కట్ చేసి, రోగులకు పంచిపెట్టారు. రోగులకు అన్నం ప్లేట్లు, స్వీట్లను పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు చంద్రకుమార్, కృష్ణకాంత్, పవన్‌కుమార్, సుమంత్, శివకుమార్, లీలావతి తదితరులు పాల్గొన్నారు.

దళితుల భూమిని అగ్రవర్ణాలకు కేటాయించారు

తిరుపతి(తిలక్‌రోడ్), జనవరి 29 : నారాయణవనం మండలం చిత్తూరు కండ్రిగ దళితవాడ ప్రజలు సర్వే నెంబరు 191/1లో గల 11 ఎకరాల 75 సెంట్ల పోరంబోకు భూమిని సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని, అయితే తహసీల్దారు ప్రమీలమ్మ రీసర్వేలో తమ అనుభవంలో ఉన్న భూమిని అరణ్యకండ్రిగ గ్రామ పంచాయతీ చెందిన జయరామనాయుడు, మల్లీశ్వరి, భాగ్యమ్మ, విజయ, జయచంద్రనాయుడుకు అప్పగించారని గ్రామస్తుడు, వికలాంగుడు నాగరాజు ఆరోపించారు.

తిరుపతి

పిల్లలకు పౌష్టికాహారం అందించాలి


తిరుపతి రైల్వేస్టేషన్‌లో చైల్డ్ హెల్ప్‌డెస్క్ పనితీరును పరిశీలిస్తున్న ఇందీవర్ పాండే

తిరుపతి(ఆటోనగర్) జనవరి 29 : పిల్లలకు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలని కేంద్ర మహిళా, శిశు సంక్షేమ అభివృద్ధి విభాగం కార్యదర్శి ఇందీవర్ పాండే అన్నారు. సోమవారం తిరుపతి రైల్వే స్టేషన్‌లో చైల్డ్ హెల్ప్‌డెస్క్‌ను ఆయన పరిశీలించారు. పనితీరును అడిగి తెలుసుకున్నారు. స్టేషన్‌లో తప్పిపోయిన పిల్లలను గుర్తించి, వారిని తల్లిదండ్రుల దగ్గరకు చేరుస్తున్నామని అక్కడి సిబ్బంది వివరించారు. చిరునామా తెలియని పిల్లలకు వసతి గృహంలో అందిస్తున్న సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంచాలవీధిలోని మున్సిపల్ స్కూల్‌లో అంగన్వాడీ కేంద్రం, బాలికల వసతి గృహాన్ని పరిశీలించారు. అంగన్వాడీలో పిల్లలకు అందించే మెనూను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రిన్సిపల్ సెక్రటరీ జయలక్ష్మి, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖాధికారి చెన్నయ్య, డీసీపీవో శివశంకర్ పాల్గొన్నారు.

నేడు స్పర్శ లెప్రసీ అవగాహన ర్యాలీ

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 29 : స్పర్శ లెప్రసీ అవగాహన కార్యక్రమాన్ని సమర్థవంతంగా చేపట్టాలని డీఆర్వో పెంచలకిషోర్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమంలో స్పర్శ లెప్రసీ అవగాహన కార్యక్రమంపై బ్యానర్‌ను జిల్లా వైద్యాధికారి, జిల్లా లెప్రసీ ఎయిడ్స్ అండ్ టీబీ ఆఫీసర్ అరుణ సులోచన దేవి, ఎపిడమాలజిస్టు డాక్టర్ కిరణ్‌నాయక్, డాక్టర్ బి.రాజాతో కలిసి ఆయన ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ 30వ తేదీ నుంచి ఫిబ్రవరి 12 వరకు స్పర్శ లెప్రసీ అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. మంగళవారం ఉదయం 8 గంటలకు డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి ఎస్వీ మెడికల్ కళాశాల వరకు ర్యాలీ జరుగుతుందని చెప్పారు.

వినాయకుడికి ప్రత్యేక పూజలు

తిరుపతి (రవాణా), జనవరి 29 : వినాయకసాగర్ వద్దనున్న సంకల్ప వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో సోమవారం సంకటహర చతుర్థశిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పురోహితుడు సురేష్‌స్వామి ఆధ్వర్యంలో పూజలు, అభిషేకాల అనంతరం అన్నప్రసాదాలు వితరణ చేశారు. ఆలయ ధర్మకర్త కొండె చెంగారెడ్డి, వరసిద్ధి వినాయక మహోత్సవ కమిటీ సభ్యులు గుండాల గోపీనాథ్‌రెడ్డి, డీపీ ఆనంద్, సుబ్రహ్మణ్యంరెడ్డి, కేశవరెడ్డి, జయప్రకాష్ పాల్గొన్నారు.

చంద్రబాబుపై పెద్దిరెడ్డి వ్యాఖ్యలు అర్థరహితం

తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనంద్‌గౌడ్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 29 : మాజీ సీఎం చంద్రబాబుపై మంత్రి పెద్దిరెడ్డి వ్యాఖ్యలు అర్థ రహితమని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనంద్‌గౌడ్ పేర్కొన్నారు. పెద్దిరెడ్డి నియంతతృత్వ పోకడలు, తాటాకు చప్పుళ్లకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు భయపడరని తెలిపారు. రాబోయే ఎన్నికల తర్వాత పెద్దిరెడ్డి పాపాలన్నీ బయటకు వస్తాయని పేర్కొన్నారు. అక్రమ మైనింగ్ చేస్తూ సహజ వనరులను కొల్లగొడుతూ వేలకోట్ల అక్రమ సంపాదన చేస్తున్న పెద్దిరెడ్డి పిచ్చి ప్రేలాపణలు ఆపాలని కోరారు. సొంత పార్టీ ఎమ్మెల్యేలే పెద్దిరెడ్డి అక్రమ మైనింగ్ వ్యవహారాన్ని వెల్లడి చేస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని ఆనంద్‌గౌడ్ ఒక ప్రకటనలో స్పష్టం చేశారు.

ఎజెండా ప్రకారమే పెద్దిరెడ్డిపై ఆరోపణలు: వైసీపీ

తిరుపతి(తిలక్‌రోడ్), జనవరి 29 : సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఎజెండా ప్రకారమే మంత్రి పెద్దిరెడ్డిపై నిందారోపణలు చేశారని వైసీపీ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి మల్లారపు మధు ఆరోపించారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆదిమూలంపై పార్టీ క్రమశిక్షణ చర్యలు తీసుకుంటుందన్నారు. వైసీపీ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంఘం నాయకులు కల్లూరు నాగరాజు, వెంకటస్వామి, చిన్ననాయుడు, జయశంకర్, సేతుపతి, రత్నం, కుప్పయ్య, రాజశేఖర్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.5.04 కోట్లు

తిరుమల, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.5.04 కోట్లు లభించింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ ఆదివారం లెక్కించి సోమవారం ఉదయం ప్రకటించింది. ఇక, ఆదివారం 85,142 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 22,064 మంది తలనీలాలు సమర్పించారు.

వెంకన్న సేవలో సినీ ప్రముఖులు


నందినిరెడ్డి, ప్రగతి - స్నేహారెడ్డి

తిరుమల, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. ఎంపీ సంజీవ్‌కుమార్, సినీ దర్శకురాలు నందినిరెడ్డి, నటి ప్రగతి, హీరో అల్లు అర్జున్ సతీమణి స్నేహారెడ్డి ఉన్నారు. వీరికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.

పుట్ట గొడుగుల పెంపకంపై శిక్షణ


తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 29 : పద్మావతి మహిళా యూనివర్సిటీలో పుట్ట గొడుగుల పెంపకంపై మహిళలకు ఉచిత శిక్షణ అందించనున్నారు. మూడు నెలల కాల పరిమితితో ఆ వర్సిటీ లైవ్లీ హుడ్ బిజినెస్ ఇన్‌క్యుబేటర్ సెంటర్ శిక్షణ అందించనుంది. ఇంటర్ ఉత్తీర్ణులైన మహిళలు అర్హులు. సమగ్ర సమాచారం కోసం 98852 44006లో సంప్రదించాలని పీఆర్వో శ్రీరజని కోరారు.

రేపు లెనిన్ శత వర్ధంతి సభ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 29: లెనిన్ శత వర్ధంతి సభ ఎస్వీయూలో బుధవారం జరగనుంది. అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) ఈ కార్యక్రమాన్ని నిర్వహించనుంది. ఉదయం 10 గంటలకు ఆర్ట్స్ బ్లాక్ ఆడిటోరియంలో ఈ సభ ప్రారంభం కానుంది. ఇందులో ప్రముఖ రచయిత ఎన్.వేణుగోపాల్ పాల్గొంటారు. సామ్రాజ్యవాదం - లెనినిజం అంశంపై ఆయన ప్రసంగిస్తారు. రష్యన్ విప్లవం - చైనా, వియత్నాంలపై ప్రభావం అంశంపై జేవీ సత్యనారాయణ మూర్తి మాట్లాడతారు. ఈ మేరకు ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి చలపతి తెలిపారు.


ఎస్వీ హైస్కూల్ గ్రౌండ్‌లో నిర్మాణాలు ఆపండి

నవీన్‌కుమార్‌రెడ్డి



తిరుపతి (రవాణా), జనవరి 29: ఏపీ ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహించే విధంగా ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు నిర్వహిస్తుంటే తిరుపతిలో మాత్రం అందుకు భిన్నంగా టీటీడీ అధికారులు క్రీడాకారులకు అందుబాటులో ఉన్న ఎస్వీ హైస్కూల్ మైదానంలో భవన నిర్మాణాలు చేపట్టడం విడ్డూరంగా ఉందని రాయలసీమ పోరాట సమితి కన్వీనర్ నవీన్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. నిర్మాణాలు ఆపాలంటూ సోమవారం ఆయన ప్లకార్డులు ప్రదర్శించారు. విద్యార్థులు ఆడుకునేందుకు ఎస్వీ హైస్కూల్ గ్రౌండ్‌ను టీటీడీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారన్నారు. తిరుపతి యువతకు ఈ మైదానాన్ని ఉపయోగించుకుని నేషనల్, స్టేట్, జోనల్, రంజీ లెవల్‌లో క్రీడల్లో రాణించారని తెలిపారు. టీటీడీ అధికారుల తీరు వారికి ఆశనిపాతంలా మారిందన్నారు. ఎస్వీ హైస్కూల్ భవనాన్ని పోలీసు శాఖకు, పద్మావతి నిలయాన్ని కలెక్టరేట్‌కు ఇచ్చిన టీటీడీ తాజాగా ఎస్వీ హైస్కూల్ మైదానాన్ని నాశనం చేసేందుకు పూనుకుందని విమర్శించారు. ఈ ప్రయత్నాలు ఆపకపోతే ఆందోళన చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.

డాక్టరేట్ ప్రదానం


సుధామణి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 29: పద్మావతి మహిళా యూనివర్సిటీ ఫార్మసీ స్కాలర్ కె.సుధామణి డాక్టరేట్ పొందారు. డిజైన్ అండ్ ఎవల్యూషన్ ఆఫ్ టార్గెటెడ్ డ్రగ్ డెలివరీ సిస్టం ఫర్ ట్రీట్‌మెంట్ ఆఫ్ లివర్ డిసీజెస్ అంశంపై ప్రొఫెసర్ జీవనజ్యోతి పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు.

షరా మామూలే..!

ఫిర్యాదులతో సరిపెడుతున్నారంటూ స్పందన బాధితుల ఆవేదన - కలెక్టరేట్‌లో స్పందనకు 201 వినతులు


వినతిపత్రాలు స్వీకరిస్తున్న డీఆర్వో పెంచలకిషోర్

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 29: 'స్పందనలో ఇస్తున్న అర్జీలకు పరిష్కారం లభించక తిరుగుతూనే ఉన్నాం.. మాపై కనికరం చూపండి' అంటూ పలువురు అర్జీదారులు అధికారుల ఎదుట వాపోయారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 200 మందికి పైగా వచ్చి అర్జీలు సమర్పించారు. ఇందులో 163మందికి పైగా రెవెన్యూ సంబంధిత వినతులిచ్చారు. అర్జీలను సకాలంలో పరిష్కరించాలని డీఆర్వో పెంచలకిషోర్ అధికారులను ఆదేశించారు. డిప్యూటీ కలెక్టర్ కోదండరామిరెడ్డి, భాస్కర్‌నాయుడు, శ్రీనివాసరావు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

శ్రీకాళహస్తిలో శాంతిభద్రతలు కాపాడండి



శ్రీకాళహస్తిలో శాంతిభద్రతలు కాపాడాలి. పట్టణానికి రోజుకు సగటున 25వేల మంది భక్తులు వస్తుంటారు. ఇటీవల కాలంలో గంజాయి వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా విరాజిల్లుతోంది. యువత గంజాయికి బానిసలై అసాంఘిక శక్తులుగా మారుతున్నారు. తద్వారా నేరాలు పెరుగుతున్నాయి. కొంతమంది గంజాయి వ్యాపారమే ప్రధాన వృత్తిగా మార్చుకున్నారు. పాలకులు వీరికి అండగా నిలబడటంతో అధికారులు చర్యలకు వెనకడుగు వేస్తున్నారు. ఆలయానికి సమీపంలో మద్యం దుకాణం ఉండటంతో భక్తులకు ఇబ్బందికరంగా మారింది. మందుబాబుల ఆగడాలు శృతిమించుతున్నాయి. మహిళలపై దాడులు పెరిగిపోయాయి. ఒంటరిగా వీధుల్లోకి రాలేని పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి శ్రీకాళహస్తిలో ప్రశాంత వాతావరణం కల్పించేందుకు చర్యలు తీసుకోండి.

- చక్రాల ఉష, తిరుపతి పార్లమెంటు తెలుగు మహిళ అధ్యక్షురాలు

భూములకు నీరు రాకుండా అడ్డుకుంటున్నారు



రేణిగుంట మండలం గుండాలకాల్వ గ్రామంలోని కొత్తచెరువు కింద 30 కుటుంబాలు వ్యవసాయం చేసుకుంటున్నాయి. అయితే మా పొలాలకు నీరు రానివ్వకుండా ఓ వ్యక్తి అడ్డుకుంటున్నారు. తద్వారా తమ పంటలు ఎండిపోతున్నాయి. తహసీల్దారు దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. మీరైనా న్యాయం చేయండి.

- ఆదినారాయణ, గుండాలకాల్వ

ఇంటి స్థలాల కోసం తిరుగుతూనే ఉన్నా..



కరకంబాడి పంచాయతీ బీసీ కాలనీలో 10 ఏళ్లుగా కాపురం ఉంటున్నాం. కూలి పనికెళితే తప్పా పూటగడవదు. అద్దె ఇంట్లో బాడుగ కట్టలేక ఇబ్బందులు పడుతున్నాం. స్థలం కోసం రెవెన్యూ కార్యాలయం చుట్టు కాళ్లరిగేలా తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదు. మీరైనా నాకు స్థలం ఇప్పించండి.

- మునెమ్మ, కరకంబాడి

జీతాలు ఇప్పించండి.. సారూ..!

'కోవిడ్ సమయంలో ప్రాణాలకు తెగించి, కుటుంబ సభ్యులకు దూరంగా ఉంటూ సేవ చేశాం. దానికి సంబంధించి మూడేళ్లవుతున్నా ఇప్పటివరకు నాలుగు నెలల జీతాలు చెల్లించలేదు. అంతంతమాత్రపు జీతాలతో కుటుంబాలను నెట్టుకురాలేక ఇబ్బంది పడుతున్నాం. అధికారులకు, ప్రజాప్రతినిధులుకు ఎన్నిసార్లు అర్జీలు సమర్పించినా దయ చూపలేదు.' ఇప్పటికైనా స్పందించాలంటూ ఇప్పటి కలెక్టరేట్, అప్పటి పద్మావతి నిలయం పారిశుధ్య కార్మికులు సోమవారం ఆందోళన చేపట్టారు. వీరికి సీపీఐ నేత శివ మద్దతు తెలిపారు. ఈ మేరకు అధికారులకు వినతిపత్రం సమర్పించారు.



దళితుల భూముల్లో ఇసుక ఎత్తేస్తున్నారు



తిరుపతి రూరల్ మండలం అగ్రహారం గ్రామ దళిత కుటుంబాలకు చెందిన రవి, మదన్‌మోహన్ ఓ ప్రైవేటు సంస్థలోని సర్వే నంబరు. 251/2లో 389లో సుమారు 9 ఎకరాలు కొనుగోలు చేశారని, అయితే రెండు, మూడు నెలలుగా చెరుకుల జనార్దన్ యాదవ్, అతని బంధువు కుమార్ ఆ భూముల్లో దౌర్జన్యంగా ప్రవేశించి ఇసుక తవ్వకుంటున్నారని సమత సైనిక్‌దళ్ నేతలు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై తిరుచానూరు పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. మీరైనా స్పందించి వారికి న్యాయం చేయాలని సమతా సైనిక్‌దళ్ నేతలు చిరంజీవి, గండిపేట సుబ్రహ్మణ్యం, కల్యాణ్‌కుమార్, రెడ్డెప్ప, మణికంట స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భాస్కర్‌నాయుడును కోరారు.

పోలీసు స్పందనకు 75 ఫిర్యాదులు


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ వెంకటరావు

తిరుపతి(నేరవిభాగం), జనవరి 29 : ప్రకాశం రోడ్డులోని జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 75 ఫిర్యాదులు అందాయి. జిల్లా పరిపాలనా విభాగం అదనపు ఎస్పీ వెంకటరావు, శాంతి భద్రతల విభాగం అదనపు ఎస్పీ కులశేఖర్, నేరవిభాగం అదనపు ఎస్పీ విమలకుమారి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫిర్యాదుదారులు తమ సమస్యలను తెలియజేసి, వినతులు అందజేశారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆమె సంబంధిత అధికారులను ఆదేశించారు.

అన్ని వర్గాలకూ వైసీపీ ద్రోహం : టీడీపీ


మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ

తిరుపతి(తిలక్‌రోడ్), జనవరి 29: సీఎం జగన్ ఎన్నికల ముందు వాగ్దానాలు చేసి గద్దెనెక్కి, ప్రస్తుతం అన్ని వర్గాలకు తీరని ద్రోహం చేశారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ విమర్శించారు. రాష్ట్రంలో వేగంగా మారుతున్న రాజకీయ పరిణామాలతో ముఖ్యమంత్రి జగన్ పరిస్థితి ఏమిటో ఆయనకు అర్థం కావడం లేదన్నారు. ప్రెస్‌క్లబ్‌లో సుగుణమ్మ మాట్లాడుతూ వైసీపీ పాలనలో అవినీతి, అక్రమాలు, కబ్జాలు, మద్యం, ఇసుక మాఫియాలతో రాష్ట్రం పూర్తిగా నాశనమైందన్నారు. ఒక్క పరిశ్రమ తేలేకపోయారని అన్నారు. పైగా పారిశ్రామికవేత్తలను వేధించి వెళ్లిపోయేలా చేశారని దుయ్యబట్టారు. జగన్‌ఎవరిని తీసుకువచ్చినా లాభం లేదని, ప్రజలు టీడీపీ, జనసేనను గెలిపించడానికి నిర్ణయం తీసుకున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నూరా సుధాకర్‌రెడ్డి, బుల్లెట రమణ, లక్ష్మీపతినాయుడు, ఆముదాల తులసీదాస్, సింగంశెట్టి సుబ్రహ్మణ్యం, జగన్నాథం, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

వైసీపీని దించేందుకు నిరుద్యోగులు సిద్ధంగా ఉన్నారు



కోడిగుడ్డుపై ఈకలు చూపుతున్న తెలుగు యువత నేతలు

తిరుపతి(తిలక్‌రోడ్), జనవరి 29 : జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి కుర్చీ నుంచి దింపడానికి నిరుద్యోగులు, యువత సిద్ధంగా ఉన్నారని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి నాయుడు విమర్శించారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉద్యోగాలు, ఉపాధి లేక, పరిశ్రమలు రాక నిరుద్యోగులు ఆత్మహత్య చేసుకుంటుంటే జగన్‌మోహన్‌రెడ్డి అండ్ కో మాత్రం దోచుకోవడం దాచుకోవడంలో పనిలో బిజీగా ఉన్నారని ఆరోపించారు. సీఎం జగన్, ఐటీ మంత్రి అమర్‌నాథ్‌రెడ్డి కోడిగుడ్డుపై ఈకలు పీకే పనిలో ఉన్నారని ఎద్దేవా చేశారు. ఐటీ శాఖ మంత్రి దావోస్ పర్యటనకు ఎందుకు వెళ్లలేదని ప్రశ్నించారు. పక్క రాష్ట్రంలో తెలంగాణ ముఖ్యమంత్రి రూ.42వేల కోట్ల పెట్టుబడులు ఆ రాష్ట్రానికి తీసుకుని వచ్చారని, వైసీపీ మంత్రులు ఆయన్ను చూసి సిగ్గు తెచ్చుకోవాలని అన్నారు. జగన్ అరాచకాలకు ఆయనకు జీవితకాలం జైలుశిక్ష వేయాలన్నారు. హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్ హేమచంద్రారెడ్డి వైసీపీ కార్యకర్తగా మారారని, వీసీలు దీన్ని ప్రోత్సహించడం సిగ్గుమాలిన చర్య అని అభివర్ణించారు. సీఎం ప్రచార ఖర్చులను ప్రజలకు తెలపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అక్కింతల కృష్ణయాదవ్, కంకణాల రజనీకాంత్‌నాయుడు, తోట వాసు, కరణం సందీప్, రంజిత్‌నాయుడు, శ్రీరాం బాబీ, మనోజ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మిషన్ ఎంబ్రాయిడరీ కోర్సుల్లో ఉచిత శిక్షణ

తిరుపతి(తిలక్‌రోడ్), జనవరి 29: కంప్యూటర్ మిషన్ ఎంబ్రాయిడరీ కోర్సుపై జన్ శిక్షణ సంస్థాన్, ఆర్ఆర్ఆర్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం నుంచి ఐదు రోజుల పాటు రాస్ సేవా నిలయంలో ఉచిత శిక్షణ కల్పిస్తున్నట్లు నిర్వాహకులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలవారు 9542352100ను సంప్రదించాలని కోరారు.

ఎయిడ్స్ కంట్రోల్ ఎంప్లాయీస్ రాష్ట్ర కమిటీ ఎన్నిక

తిరుపతి సిటీ, జనవరి 29 : రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కమిటీ సర్వసభ్య సమావేశం సోమవారం రాస్ భవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సుదుర్తి వేణు, ప్రధాన కార్యదర్శిగా వెంకటసుబ్బయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జె.వీరాస్వామి, ఉపాధ్యక్షుడిగా కె.అపర్ణ, కోశాధికారిగా ఎన్.హరిబాబు, అధికార ప్రతినిధిగా ఎస్ఎండీ షాహీద్, కోఆర్డినేటర్‌గా కె.కోటిరత్నంను ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడు వేణు మాట్లాడుతూ ఎయిడ్స్ కంట్రోల్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

సేవలను గుర్తించాలంటూ పారిశుధ్య కార్మికుల ఆందోళన

తిరుపతి సిటీ, జనవరి 29 : అహర్నిశలూ రోగులకు సేవ చేస్తున్న తమను రుయా అధికారులు గుర్తించడం లేదని కొందరు పారిశుధ్య కార్మికులు సోమవారం రుయాస్పత్రి పరిపాలన భవనం వద్ద ఆందోళనకు దిగారు. వారు మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవం రోజు అన్ని విభాగాల వారికి ఉత్తమ అవార్డులు అందించిన అధికారులు తమ సంస్థను గుర్తించకపోవడం దారుణమన్నారు. వెంటనే తమ కష్టాన్ని గుర్తించి పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఈ-కామర్స్‌పై శిక్షణ తరగతుల ప్రారంభం

తిరుపతి(విద్య), జనవరి 29: పద్మావతినగర్‌లోని జీఎస్ మాస్టర్స్ సంస్థ ఆధ్వర్యంలో మేనేజ్‌మెంట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ఆన్ ఈ-కామర్స్ సర్టిఫికెట్ కోసం శిక్షణ తరగతులను సోమవారం ఉదయం ప్రారంభించారు. జీఎస్‌మాస్టర్స్ ఫౌండర్ ఎం.శివనాథ్ మాట్లాడుతూ ఏదైనా డిగ్రీ పూర్తిచేసిన విద్యార్థులు ఈ శిక్షణకు అర్హులని, వచ్చేనెల 2వ తేదీ వరకు శిక్షణ నిర్వహిస్తున్నామని తెలిపారు. 25మంది విద్యార్థులు హాజరయ్యారని, ఈ-కామర్స్‌పై పూర్తి అవగాహనతో పాటు స్వయం ఉపాధికి ఈ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని స్పష్టం చేశారు. సెంట్రల్ గవర్నమెంట్ మైక్రో స్మాల్ మీడియం ఎంటర్‌ప్రైజస్ ద్వారా సర్టిఫికెట్ అందిస్తుందని వివరించారు. మరిన్ని వివరాల కోసం 8555981073ను సంప్రదించాలని కోరారు.

టీడీపీతోనే బీసీల అభ్యున్నతి


మీడియాతో మాట్లాడుతున్న టీడీపీ బీసీ నాయకులు

తిరుపతి(తిలక్‌రోడ్), జనవరి 29 : బీసీల అభ్యున్నతి టీడీపీతోనే సాధ్యమని టీడీపీ బీసీ సంఘం నేతలు స్పష్టం చేశారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో నాయకులు జగన్నాథం, ఆనంద్‌యాదవ్, కృష్ణయాదవ్ మాట్లాడుతూ తిరుపతి నగరంలో 60 శాతం ఉన్న బీసీలు ఆర్థికంగా, విద్యా, రాజకీయ పరంగా ఎదిగేందుకు కృషి చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో బీసీలకు పెద్దపీట వేసింది టీడీపీ అని గుర్తు చేశారు. వైసీపీలో బీసీలకు పదవులు కట్టబెట్టి పెత్తనమంతా ఎవరు చేస్తున్నారో ప్రజలకు తెలుసన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ బీసీ సంఘం నాయకులు ఆముదాల తులసీదాస్, రాజయ్య, మధుసూదన్‌యాదవ్, శ్రీరాములు, చంద్రశేఖర్ ఆచారి, అశోక్‌బాబు పాల్గొన్నారు.

జగన్ దళిత ద్రోహి

కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ చింతా మోహన్

తిరుపతి(తిలక్‌రోడ్), జనవరి 29: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం దళిత ద్రోహి అని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ విమర్శించారు. సోమవారం సాయంత్రం ఇంటింటికీ కాంగ్రెస్ పార్టీ ప్రచార కార్యక్రమంలో భాగంగా అన్నారావు సర్కిల్, కపిలతీర్థం రోడ్డు, చిన్నబజారువీధి, గాంధీరోడ్డు ప్రాంతాల్లో పర్యటించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ 'మార్పు కావాలి.. కాంగ్రెస్ రావాలి' అనే కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందన్నారు. కోడికత్తి ఘటన ఎన్నికల కోసం ఆడిన డ్రామా అని ఆరోపించారు. తిరుపతిలో 7,008మంది నిరుపేద మహిళలకు బెడ్‌రూమ్ ఇళ్లు ఆపి, చంద్రబాబు నిరుపేద మహిళల ద్రోహిగా మారారన్నారు. దుగరాజపట్నం ఓడరేవును దుఃఖరాజపట్నం ఓడరేవుగా మార్చినందుకు నిరుద్యోగ ద్రోహిగా అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గోపీగౌడ్, రవి, శాంతియాదవ్, తేజోవతి, సింధుజ, వెంకటేష్‌గౌడ్, జావెద్ తదితరులు పాల్గొన్నారు.


ప్రచారం చేస్తున్న చింతామోహన్

లారీ చక్రాల కింద నలిగి మహిళ మృతి



నాగమ్మ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ నాగబాబు


కోట, జనవరి 29: కోట మండలం సిద్ధవరం పెట్రోల్ బంకు వద్ద జరిగిన ప్రమాదంలో లారీ చక్రాల కింద ఇరుక్కొని ఓ మహిళ మృతి చెందింది. స్థానికుల కథనం మేరకు... కోట మండలం వెంకన్నపాళెంకు చెందిన గెంజి శంకరయ్య, నాగమ్మ(48) దంపతులు చిల్లకూరు మండలం కొమరావారిపాళెంలోని బంధువుల ఇంటికెళ్లారు. మోటారు బైక్‌లో తిరిగి స్వగ్రామమైన వెంకన్నపాళానికి వస్తుండగా కోట నుంచి బల్లవోలు వైపు వెళ్తున్న సిలికా తరలించే లారీ ఢీకొంది. బైక్ లారీ వెనుకచక్రాల కింద ఇరుక్కుపోయింది. ఈ క్రమంలో లారీ చక్రాలు నాగమ్మ తలపైకి ఎక్కడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. బైక్ నడుపుతున్న శంకరయ్య తీవ్రంగా గాయపడ్డాడు. అయనను చికిత్స నిమిత్తం కోట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎస్ఐ నాగబాబు సంఘటనాస్థలానికి చేరుకుని లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొన్నారు. నాగమ్మ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నీటిగుంటలో పడి కూలీ మృతి

దొరవారిసత్రం, జనవరి 29: నీటిగుంటలో పడి కూలీ మృతి చెందిన ఘటన దొరవారిసత్రం మండలం ఉచ్చూరు గ్రామంలో ఆదివారం సాయంత్రం వెలుగుచూసింది. మండలంలోని మంగళంపాడు గ్రామానికి చెందిన వేలింబేటి హరినాథ్(47) కూలి పనుల నిమిత్తం మూడు రోజుల క్రితం ఇంటి నుంచి వచ్చాడు. ఆదివారం సాయంత్రం ఉచ్చూరులోని గుడి గుంట నీటిలో శవం తేలాడుతుండటంతో స్థానికులు గుర్తించారు. సోమవారం ఉదయం పోలీసులు వచ్చి మృతదేహాన్ని వెలికితీశారు. మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిరుమలరావు తెలిపారు.

అనుమానంతోనే భార్య అంతం

● హత్య కేసులో లారీ డ్రైవర్‌కు రిమాండు



పవిత్ర మృతదేహం గొంతుపై ఉన్న గాయాలు

శ్రీకాళహస్తి, జనవరి 29: అనుమానంతోనే భార్య పవిత్ర(36)ను లారీ డ్రైవర్ సుబ్రమణ్యం(55) పథకం ప్రకారం హత్య చేశాడని శ్రీకాళహస్తి 1టౌన్ సీఐ నరసింహారావు తెలిపారు. పట్టణంలోని పోలీస్‌స్టేషన్లో సోమవారం విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. వరదయ్యపాళెంకు చెందిన శ్రీనివాసులు లారీ డ్రైవర్. అతడి భార్య పవిత్ర శ్రీసిటీలోని ప్రైవేట్ కర్మాగారంలో పనిచేసేది. శ్రీనివాసులు మొదటి భార్య అనారోగ్యంతో మృతి చెందింది. ఆ తర్వాత బంధువులు సొంత అక్క కూతురు అయిన పవిత్రతో సుమారు 20 ఏళ్ల క్రితం వివాహం చేశారు. ప్రస్తుతం ఇంటర్ చదివే కొడుకు ఉన్నాడు. మద్యం, జూదానికి బానిసైన శ్రీనివాసులు తరచూ భార్యతో గొడవ పడేవాడు. ఈ క్రమంలో కొద్ది సంవత్సరాల నుంచి అనుమానంతో ఇద్దరి మధ్య వివాదాలు తలెత్తాయి. రెండు వారాల క్రితం భార్యతో గొడవపడి తలపై కర్రతో దాడి చేశాడు. ఆమె గాయపడింది. 13వ తేదీన తిరుపతిలోని ప్రైవేట్ వైద్యశాలలో చేర్పించారు. ఈ నెల 24న ఆమెను డిశ్చార్జ్ చేశారు. భార్యతో బుద్ధిగా కాపురం చేసుకుంటానని బంధువులకు విన్నవించాడు. తొలుత ముక్కంటి ఆలయాన్ని దర్శించుకుని తర్వాత ఇంటికి వస్తామని తెలియ జేసి శ్రీకాళహస్తికి బయలుదేరారు. పథకం ప్రకారం మొదట స్వర్ణముఖి నదిలో స్నానం చేసి ఆలయాన్ని దర్శించుకుందామని ఆమెను నమ్మించాడు. చీకటి పడిన తర్వాత స్నానం చేద్దామంటూ నదిలో దిగిన తర్వాత భార్యను బలవంతంగా ముంచేసి చంపేశాడు. ఆ తర్వాత నీటిలో పడిపోయిందని నమ్మించే ప్రయత్నం చేశాడు. పోస్టుమార్టంలో వాస్తవాలు వెలుగుచూడడంతో నిందితుడిని అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. ఈ కేసు ఛేదనలో చురుగ్గా వ్యవహరించిన పోలీసులను , సీఐని ఉన్నతాధికారులు అభినందించారు.

జూకు కొత్త జంతువుల రాక



కొత్తగా వచ్చిన జంతువులు - జూకు తరలిస్తున్న సిబ్బంది

తిరుపతి అర్బన్, జనవరి 29: తిరుపతి శ్రీవెంకటేశ్వర జంతు ప్రదర్శనశాలకు సోమవారం కొత్త జంతువులు వచ్చాయి. ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాంలో భాగంగా ఛత్తీస్‌గఢ్ బిలాస్‌పురం కానన్ పెండారి జులాజికల్ గార్డెన్ నుంచి ఒక జత నక్కలు, రెండు జతల థామిన్ జింకలు, మూడు జతల అడవి జింకలను తీసుకువచ్చినట్లు క్యూరేటర్ సెల్వం తెలిపారు. జంతువులు ఆరోగ్యంగా ఉన్నాయని, వాటిని డాక్టర్ల పర్యవేక్షణలో ఉంచామని తెలిపారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి, సంక్షేమం

చిల్లకూరు, జనవరి 29: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పంటా శ్రీనివాసులురెడ్డి, పూల చంద్రశేఖర్ అన్నారు. సోమవారం గూడూరులో పట్టణ కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీని ఎంపిక చేశారు. అధ్యక్షులుగా భాస్కర్‌రావు, శ్రీను, ఆర్గనైజింగ్ సెక్రటరీగా శ్రీనివాసాచారిని నియమించారు. వేమయ్య, భాస్కర్‌రెడ్డి, చిన్నయ్య పాల్గొన్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

నివాళి

వెంకటగిరి, జనవరి 29: వెంకటగిరి పట్టణం తోలిమిట్ట ప్రాంతంలో వృద్ధాశ్రమం నిర్వహిస్తున్న రమాకాంత్ ఇటీవల మృతి చెందారు. సోమవారం ఆయన చిత్రపటానికి పట్టణంలోని పలు స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు, టీడీపీ నాయకులు నివాళులర్పించారు. ఆయన కర్మక్రియల నిర్వహణకు మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ చారిటబుల్ ట్రస్టు ద్వారా రూ.10వేలు, జీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్టు ద్వారా రూ.5 వేలు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు గంగోటి నాగేశ్వరావు, పులికొల్లు రాజేశ్వరావు, కేవీకే ప్రసాద్ నాయుడు, కవచా చారిటబుల్ ట్రస్టు నిర్వాహకుడు గుండు మనోజ్, మార్పు సంస్థ నిర్వాహకులు చిగురుపాటి పవన్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సాగు భూములకు పట్టాలు ఇవ్వండి



తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న గిరిజనులు

డక్కిలి, జనవరి 29: మండలంలోని మోపూరు సర్వే నెంబరు 1లో గిరిజనులు, సంచారజాతులు సాగు చేసుకొంటున్న భూములకు యాజమాన్య హక్కు కల్పించాలని కోరుతూ ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ప్రజాసంఘాల ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ గద్దల మునెయ్య మాట్లాడుతూ మోపూరు రోడ్డు, సూరాయపాళెం, మోపూరు వెల్లంపల్లి ప్రాంతాల్లో గిరిజనులు, సంచారజాతులకు చెందిన కుటుంబాలు గత కొన్నేళ్ల నుంచి అటవీ భూములను సాగు చేసుకొంటున్నారని, వారికి పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే మిగులు భూములను పంచిపెట్టాలని కోరారు. అనంతరం తహసీల్దార్ రమేష్ బాబుకు వినతిపత్రం అందజేశారు. త్వరలో సర్వే నిర్వహించి అర్హులను గుర్తించి న్యాయం చేస్తామని తహసీల్దారు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు. చిరంజీవి, చంగయ్య, రఫీ, శ్రీనివాసులు, చెంచుకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

జగనన్న లే అవుట్, టిడ్కో గృహాలతో

మరో వెంకటగిరి నిర్మాణం

● 136 ఎకరాల్లో నగర వనం
● నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి



లబ్ధిదారుకు తాళం అందజేస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి, నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి

వెంకటగిరి టౌన్, జనవరి 29: జగనన్న లే అవుట్, టిడ్కో గృహాలతో వెంకటగిరి కొత్త పట్టణంగా రూపు రేఖలు సంతరించుకుంటుందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి అన్నారు. వెంకటగిరిలోని తిరుపతి రోడ్డులో నిర్మించిన టిడ్కో ఇళ్లను సోమవారం ప్రారంభించి లబ్ధిదారులకు అప్పగించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డిప్యూటీ సీఎం నారాయణ స్వామి మాట్లాడుతూ టిడ్కో గృహాల ద్వారా పైసా ఖర్చు లేకుండా సొంతింటి కల నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే లక్షల ఇళ్లు లబ్ధిదారులకు అందించామన్నారు. వచ్చే ఎన్నికల్లో రాంకుమార్ రెడ్డిని గెలిపించి నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసుకోవాలని కోరారు. రాంకుమార్ రెడ్డి మాట్లాడుతూ పట్టణంలో 1008 టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అందజేశామని తెలిపారు. త్వరలో జగనన్న లేఅవుట్ ఎదురుగా 136 ఎకరాలతో నగర వనం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. నేదురుమల్లి జనార్దనరెడ్డి, రాజ్యలక్ష్మి కృషితో వెంకటగిరి ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీని గెలిపించాలని కోరారు. సర్వజ్ఞ యాచేంద్ర మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ ఇచ్చిన హామీల్లో 99శాతం నెరవేర్చారన్నారు. టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందించడం గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మేరిగ మురళి, టిడ్కో ఛైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్, మున్సిపల్ ఛైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, వైసీపీ పట్టణ కన్వీనర్ డిల్లీబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి చిట్టేటి హరకృష్ణ, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు, ప్రచార విభాగం అధ్యక్షుడు నెమ్మళ్లపూడి సురేష్‌రెడ్డి, ఉమామహేశ్వరి, ధనియాల రాధ, సుకన్య, మల్లీశ్వరి, నారాయణ, జానకీ రామయ్య తదితరులు పాల్గొన్నారు.

దళితుల భూమిని అగ్రవర్ణాలకు కేటాయించారు



సమావేశంలో మాట్లాడుతున్న బాధితులు

తిరుపతి(తిలక్‌రోడ్), జనవరి 29 : నారాయణవనం మండలం అరణ్యకండ్రిగ పంచాయతీ చిత్తూరుకండ్రిగ దళితవాడ ప్రజలు గ్రామ సమీపంలోని సర్వే నెంబరు 191/1లో గల 11 ఎకరాల 75 సెంట్ల పోరంబోకు భూమిని 25 సంవత్సరాలకు పైగా సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని, అయితే తహసీల్దారు ప్రమీలమ్మ రీసర్వేలో తమ అనుభవంలో ఉన్న భూమిని అరణ్యకండ్రిగ గ్రామ పంచాయతీ చెందిన జయరామనాయుడు, మల్లీశ్వరి, భాగ్యమ్మ, విజయ, జయచంద్రనాయుడుకు అప్పగించారని గ్రామస్తుడు, వికలాంగుడు నాగరాజు ఆరోపించారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ నిరుపేద దళితులకు భూమి కేటాయించాల్సిందిపోయి వారి సాగులో ఉన్న వాటిని అగ్రకులాల వారికి కట్టబెట్టడం దారుణమన్నారు. స్పందనలో ఫిర్యాదు చేసినా తహసీల్దారు అక్కడి అధికారులను తప్పుదారి పట్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే కలెక్టర్ స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంతమ్మ, మునెమ్మ, నాగభూషణమ్మ, చెంగమ్మ, నీలమ్మ, లక్ష్మమ్మ, వెంకటమ్మ, పరిమిళ నందిని తదితరులు పాల్గొన్నారు.

నేడు సర్పంచుల నిరసన దీక్ష

తిరుపతి(తిలక్‌రోడ్), జనవరి 29: పంచాయతీల నిధులను బదలాయించుకుంటూ మోసం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి కనువిప్పు కలగాలని సర్పంచులు మంగళవారం నిరసన దీక్ష చేస్తున్నట్లు పంచాయతీ రాజ్ చాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగంశెట్టి సుబ్బరామయ్య తెలిపారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ 73, 74 రాజ్యాంగ సవరణలోని ఆర్టికల్ 243 జి 11షెడ్యూల్‌లో పేర్కొన్న 29 అంశాల్లోని నిధులు, విధులు, అధికారాలను స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులైన సర్పంచులు, ఎంపీటీసీ, జడ్పీటీసీ, ఎంపీపీ, జిల్లా పరిషత్ ఛైర్మన్లకు బదలాయించి, పంచాయతీలను బలోపేతం చేయాలని కోరారు. సర్పంచుల 16 డిమాండ్లను తక్షణం పరిష్కరించాలని కోరారు. ఈ మేరకు మంగళవారం పాత మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన దీక్షలు చేస్తున్నట్లు చెప్పారు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర కార్యదర్శి కిరణ్‌యాదవ్, రవి పాల్గొన్నారు.

ఏపీఈఆర్సీకి మూడు ఫిర్యాదులు

తిరుపతి(ఆటోనగర్) జనవరి 29: రాష్ట్రవిద్యుత్ నియంత్రణ మండలి చేపట్టిన విద్యుత్ వినియోగదారుల బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణకు మొదటి రోజు సోమవారం ముగ్గురు వ్యక్తులు సమస్యలను ఛైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. తిరుపతి సర్కిల్ పరిధి పుత్తూరు డివిజన్ కేంద్రంలో ఆన్‌లైన్ విధానంలో జరిగిన అభిప్రాయ సేకరణలో కార్వేటినగరానికి చెందిన ముగ్గురు హాజరయ్యారు. పర్వేజ్ మాట్లాడుతూ సున్నా నుంచి వంద యూనిట్ల వరకు ఒకస్లాబ్‌గా నిర్ణయించాలని కోరారు. ట్రూఅప్ చార్జీలు రద్దు చేయాలని సమీరుద్దీన్ కోరారు. కార్వేటినగరంలో 24 గంటలు నీటి సరఫరా మోటర్లు నడుస్తున్నాయని, అవసరం మేరకే వినియోగించాలని కేశవరాజు కోరారు. అదేవిధంగా త్రీస్టార్ కంపెనీల పరికరాలను వాడాలని, సెక్షన్ కేంద్రాల సమీపంలో దుకాణాలు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో పుత్తూరు ఈఈ చిన్నరెడ్డప్ప, కార్వేటినగరం డిప్యూటీ ఈఈ నాగరాజు, ఏఈలు పాల్గొన్నారు.

సైబర్ నేరాల బారినపడితే 1930కు కాల్ చేయండి

● ఇంటర్నెట్‌లో వ్యక్తిగత సమాచారం షేర్ చేయొద్దు
● బ్యాంకింగ్ కార్యకలాపాల్లో అప్రమత్తంగా ఉండాలి
● సీఐడీ అధికారులు, సైబర్ నిపుణులు



జ్యోతి ప్రజ్వలనతో సదస్సును ప్రారంభిస్తున్న ముఖ్య అతిథులు

తిరుపతి(నేరవిభాగం), జనవరి 29: ఎవరైనా సైబర్ నేరాల బారినపడితే తక్షణం హెల్ప్‌లైన్ నంబర్ 1930కి కాల్ చేయాలని సీఐడీ ఎస్పీ ఎంవీఎస్ స్వామి సూచించారు. సైబర్ నేరాలు, నియంత్రణ, నివారణపై చైతన్య సదస్సులు స్థానిక ఎస్వీయూ సెనెట్ హాల్లో సోమవారం నిర్వహించారు. సీఐడీ ఆధ్వర్యంలో రెండు దఫాలుగా జరిగిన ఈ సదస్సులకు ఎస్వీయూ వీసీ వి.శ్రీకాంత్‌రెడ్డి అధ్యక్షుడిగా వ్యవహరించారు. ఇతర అతిథులతో కలిసి జ్యోతి ప్రజలన చేసి ఆయన సదస్సును ప్రారంభించారు. సీఐడీ ఎస్పీ ఎంవీఎస్ స్వామి మాట్లాడుతూ మొబైల్, ఇంటర్నెట్, సోషల్ మీడియా ప్లాట్‌ఫాంల వినియోగంపై అవగాహన పెంపొందించుకుని జాగ్రత్తలు పాటిస్తే సైబర్ నేరాల బారినపడే ప్రమాదం ఉండదన్నారు. అవగాహన కల్పించేందుకే సీఐడీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు వివరించారు. దీనికిముందు సభాధ్యక్షులుగా ఎస్వీయూ వీసీ శ్రీకాంత్‌రెడ్డి, ఇన్ఫోసెక్ ఎన్ కంప్లయన్స్ సొల్యూషన్స్ (ఐఎస్ఎన్‌సీఎస్) డైరెక్టర్ రవిశంకర్ మాట్లాడుతూ సులభంగా డబ్బు సంపాదించేందుకు కొంతమంది అమాయక ప్రజల అవగాహనాలేమిని ఆసరా చేసుకుని సైబర్ నేరాలతో మోసగిస్తున్నా రన్నారు. మంగళగిరి సీఐడీ సైబర్‌సెల్ సెక్యూరిటీ నిపుణులు ఐఎల్ నరసింహారావు జాగ్రత్తల గురించి వివరించారు. వ్యక్తిగత సమాచారాన్ని ఎవరితోనూ పంచుకోవద్దని, ఓటీపీలను చెప్పవద్దని, ముఖ్యంగా బ్యాంకింగ్ వ్యవహారాల్లో అత్యంత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ సదస్సుల్లో సీఐడీ డీఎస్పీలు ఎ.పద్మలత, పి.శంకర్, కె.రసూల్ సాహెబ్, నెల్లూరు సీఐడీ డీఎస్పీ కె.వేణుగోపాల్, ఇతర అధికారులు రామకిషోర్, ఎంవీ రమణ, ఎం.రవినాయక్ పాల్గొన్నారు.

తమిళనాడు రేషన్ బియ్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న బియ్యంతో అధికారులు

సూళ్లూరుపేట, జనవరి 29: సూళ్లూరుపేట పట్టణంలో సోమవారం విజిలెన్స్, సివిల్ సప్లయిస్ అధికారులు దాడులు చేసి తమిళనాడు రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. సివిల్ సప్లయిస్ డీటీ ఓబయ్య కథనం మేరకు.. పట్టణంలోని బాపూజి కాలనీలో సామర్ల రమేష్ ఇంటిపై విజిలెన్స్, సివిల్ సప్లయిస్ అధికారులు దాడులు చేశారు. అక్రమంగా నిల్వ ఉన్న 117 బస్తాల తమిళనాడు రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొన్నారు. ఆ బియ్యం అదే ప్రాంతానికి చెందిన మీజూరు హరినాథ రెడ్డికి చెందినదిగా విచారణలో తేలింది. దీంతో ఆయనపై కేసు నమోదు చేసినట్లు విజిలెన్స్ ఎస్ఐ రామకృష్ణ నాయక్ తదితరులు తెలిపారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని సప్లయిస్ గోదాముకు తరలించారు.

పాఠశాలలో ఎంఈవో తనిఖీలు

తడ, జనవరి 29: మండల పరిధిలోని పెద్దమాంబట్టు ప్రాథమిక పాఠశాలను ఎంఈవో మల్లికార్జున్‌రావు సోమవారం తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరును పరిశీలించారు. సిలబస్ ఎంత వరకు పూర్తి చేశారన్న విషయంపై విద్యార్థుల నుంచి అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. సీబీఏ పరీక్షకు సంబంధించి ఓఎంఆర్ పత్రాలను విద్యాశాఖ కార్యాలయానికి పంపాలని ఆదేశించారు. ఆయన వెంట సీఆర్పీలు ఉన్నారు.

అధ్యాపకులకు శిక్షణ తరగతులు



కార్యక్రమంలో మాట్లాడుతున్న స్వాతిపుత్రన్

కోట, జనవరి 29: మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం వాద్వాని ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎంప్లాయిబిలిటీ స్కిల్స్‌పై శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరిగే ఈ శిక్షణ తరగతులను కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధ్యాపకులకు ఇలాంటి శిక్షణ తరగతుల వల్ల విద్యార్థులు కావాల్సిన ఉద్యోగ నైపుణ్యాలను మెరుగుపరుచుకునేందుకు ఎంతో ఉపయోగమన్నారు. మాస్టర్ ట్రైనర్ స్వాతి పుత్రన్ అధ్యాపకులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో మెకానికల్ విభాగాధిపతి ఇందుమతి తదితరులు పాల్గొన్నారు.

సిద్ధార్థ లాజిస్టిక్స్ పరిశ్రమకు రెండో సారి అవార్డు



అవార్డు స్వీకరిస్తున్న నవీన్‌కుమార్

శ్రీసిటీ, జనవరి 29: అంతర్జాతీయ కస్టమ్స్ డే-2024 సందర్భంగా, విజయవాడలోని కస్టమ్ ప్రివెంటివ్ కమిషనరేట్ కార్యాలయం వారు శ్రీసిటీకి చెందిన సిద్ధార్థ లాజిస్టిక్స్ ప్రైవేటు లిమిటెడ్ పరిశ్రమకు ఉత్తమ దిగుమతిదారు అవార్డు అందజేశారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో పనితీరు ఆధారంగా ఈ ఎంపిక జరగగా ఈ నెల 27న కాకినాడలో జరిగిన కార్యక్రమంలో కస్టమ్స్, సెంట్రల్ పన్నుల చీఫ్ కమిషనర్ నుంచి సిద్ధార్థ కంపెనీ జనరల్ మేనేజర్ నవీన్‌కుమార్ అవార్డును అందుకున్నారు. సిద్ధార్థ లాజిస్టిక్స్ ఈ ప్రతిష్ఠాత్మక అవార్డును అందుకోవడం ఇది వరుసగా రెండవ సంవత్సరం కావడం విశేషం. కాగా ఇది కంపెనీ ఉత్తమ పనితీరు, నిబద్ధతకు నిదర్శనం. తమ సిబ్బంది అత్యుత్తమ పనితీరు, సమిష్టి కృషికి గుర్తింపుగా ఈ అవార్డు దక్కిందని సిద్ధార్థ లాజిస్టిక్స్ మేనేజింగ్ డైరెక్టర్ నిశ్చల్ పాధ్య అన్నారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టరక్ డా. రవీంద్ర సన్నారెడ్డి సిద్ధార్థ లాజిస్టిక్స్ బృందాన్ని అభినందించారు.

పాదిరేడువాసులకు న్యాయం చేస్తాం: భాను



టీడీపీలో చేరిన పాదిరేడువాసులతో భానుప్రకాష్

వడమాలపేట, జనవరి 29: మండలంలోని పాదిరేడు పంచాయతీవాసులకు న్యాయం చేస్తామని నగరి నియోజకవర్గ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ చెప్పారు. పాదిరేడు పంచాయతీ పరిధిలో ఆరుంధతివాడ, దళితవాడకు చెందిన 50 కుటుంబాలవారు టీడీపీలో చేరారు. వారికి భానుప్రకాష్ పార్టీ కండవాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాదిరేడు అరణ్యం భూముల్లో వైసీపీ ఏజెంట్ల వల్ల స్థానికులు మోసానికి గురయ్యారని, టీడీపీ అధికారంలోకి రావడంతోనే పూర్తిస్థాయిలో విచారణ నిర్వహించి బాధితులకు న్యాయం జరిగేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. టీడీపీలో చేరిన వారిలో రాజేష్, అనిల్, సురేష్, మహేష్, పరుశురాం, దాము,అశోక్, మునీంద్ర, చక్రవర్తి, మదన్, హేమాద్రి, లోకేష్, మనోహర్, విజయ్, తులసీరామ్, కార్తీక్, విశ్వనాథ్ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గణపతి, దాముయాదవ్, సతీష్, చందు, ధనంజయులు నాయుడు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ మీట్

పుత్తూరు అర్బన్, జనవరి 29: మున్సిపల్ సాధారణ సమావేశాన్ని మంగళవారం ఉదయం 11గంటలకు నిర్వహించనున్నట్లు కమిషనర్ కేఎల్ఎన్ తెలిపారు. సమావేశంలో వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నట్లు చెప్పారు.

పుత్తూరు వార్తలు

అటవీ కార్మికులకు న్యాయం చేయండి

పుత్తూరు టౌన్, జనవరి 29: టీటీడీ అటవీ కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటేష్ మాట్లాడుతూ టీటీడీలో అటవీ కార్మికులు 38నెలలుగా రిలే దీక్ష చేస్తున్నా పట్టించుకోకపోవడం సరికాదన్నారు. ఇప్పటికైనా టీటీడీ అటవీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పురుషోత్తం, సుబ్రహ్మణ్యం పిళ్లై, నందయ్య, అంగన్వాడీ యూనియన్ నాయకులు విజయకుమారి, రాధ,పద్మజ, లలిత, అంబికా, అన్నపూర్ణ, మోహనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

ముద్దుకృష్ణమను మరిపిస్తా: భానుప్రకాష్



స్వామివీధిలో సైకిల్ తొక్కుతూ ప్రచారం నిర్వహిస్తున్న భానుప్రకాష్

పుత్తూరు అర్బన్, జనవరి 29: ప్రజలకు సేవ చేయడంలో తన తండ్రి గాలి ముద్దుకృష్ణమ నాయుడును మరిపిస్తానని నగరి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ అన్నారు. సోమవారం మున్సిపల్ పరిధిలోని 16వ వార్డు స్వామివీధిలో మీతో మీ తెలుగుదేశం, బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని వార్డు ఇన్‌చార్జి లక్ష్మణాచారి ఆధ్వర్యంలో జనసేన నాయకులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాలి ముద్దుకృష్ణమ నాయుడు 1983లో పుత్తూరు ఎమ్మెల్యేగా గెలిచిన మొదలు తుది శ్వాస వరకు కుటుంబం కన్నా నియోజకవర్గ ప్రజలతోనే ఎక్కువగా గడిపారని గుర్తు చేసుకున్నారు. పుత్తూరు అభివృద్ధిలో అణువనువునా ముద్దుకృష్ణమ కష్టం దాగి ఉందని, దీన్ని ఎవరూ కాదనలేని సత్యమని తేల్చిచెప్పారు. ఆయన బిడ్డగా ప్రజలకు సేవ చేసేందుకు ముందుకు వచ్చానని, ప్రతి ఒక్కరూ మనస్ఫూర్తిగా ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలందరికీ అందుబాటులో ఉంటూ ఏ కష్టం వచ్చినా ఆదుకుంటానని భరోసా ఇచ్చారు.

మంత్రులూ నోరు జాగ్రత్త..

చంద్రబాబుపై అవాకులు, చెవాకులు పేలితే సహించే ప్రసక్తే లేదని భానుప్రకాష్ హెచ్చరించారు. చంద్రబాబుపై రాళ్లతో దాడి చేస్తామని మంత్రి పెద్దిరెడ్డి చెప్పడాన్ని ఆయన తీవ్రంగా తప్పుపట్టారు. మంత్రులకు ఓటమి భయం పట్టుకుందని, టీడీపీ అధికారంలోకి వస్తే ఐదేళ్లలో చేసిన అవినీతి బయట పడుతుందనే భయంతోనే పెద్దిరెడ్డి, రోజా నోటికి వచ్చినట్లు చంద్రబాబును దూషిస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. నోరు జాగ్రత్తగా ఉపయోగించకుంటే భారీ మూల్యం చెల్లించుకుంటారని హెచ్చరించారు. వైసీపీలో దళితులను ఏ విధంగా గౌరవిస్తారో ఎమ్మెల్యే ఆదిమూలం ఉదంతమే తార్కాణమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గంజి మాధవయ్య, పట్టణ అధ్యక్షుడు గాలి జీవరత్నం నాయుడు, ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ ధనపాల్, యూనిట్ ఇన్‌చార్జి ఆనంగి ఆనంద్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు షణ్ముగరెడ్డి, మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఖాజాపీర్, వార్డు నాయకులు పాల భాస్కర్, రమేష్‌నాయుడు, నాని, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త మహేష్, కటికం నాగార్జున, చైతన్య సాగర్, జగదీష్, టీడీపీ నాయకులు డీజీ ధనపాల్, అన్బు, కరుణాయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.5.04 కోట్లు

తిరుమల, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.5.04 కోట్లు లభించింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ ఆదివారం లెక్కించి సోమవారం ఉదయం ప్రకటించింది. ఇక, ఆదివారం 85,142 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 22,064 మంది తలనీలాలు సమర్పించారు.

విద్య, పరిశ్రమల మధ్య అంతరం తగ్గించాలి



సదస్సుకు హాజరైన పలు పరిశ్రమల ప్రతినిధులు, (ఇన్‌సెట్లో) మాట్లాడుతున్న ఐఐటీ డైరెక్టర్

ఏర్పేడు, జనవరి 29: పరస్పర ప్రయోజనం, సామాజిక బాధ్యత కోసం విద్య, పరిశ్రమల మధ్య అంతరాన్ని తగ్గించాలని ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ కోరారు. తిరుపతి ఐఐటీ కెమికల్ ఇంజనీరింగ విభాగం పరిశోధన, విద్యా కార్య కలాపాల ప్రదర్శన, వివిధ పరిశ్రమలతో సహకారం పెంపొందించడం కోసం 'పరిశ్రమ - అకాడమీ ఇంటరాక్షన్ ఈవెంట్‌ను సోమవారం నిర్వహించింది. ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కేఎన్ సత్యనారాయణ ఈ సదస్సును ప్రారంభించారు. ఈ సదస్సుకు పలు పరిశ్రమల నుంచి నిపుణులు హాజరయ్యారు. కెమికల్ ఇంజనీరింగ్ విభాధిపతి ప్రొఫెసర్ టి.సునీల్ కుమార్ విజన్ మిషన్, ఐఐటీలో ఉన్న సౌకర్యాలు, అధ్యాపకులు, విద్యార్థులు, సాధించిన విజయాలను సంక్షిప్తంగా పరిచయం చేశారు. ఈ సదస్సు దీర్ఘకాలిక భాగస్వామ్యాలు, జాయింట్ వెంచర్లకు మార్గం సుగమం చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్య క్రమంలో ఎల్ అండ్‌టీ కమ్‌సోల్, యురేనియం కార్పొరేషన్, అమరరాజ గ్రూప్, బైకాన్, అప్లైడ్ మెటీరియల్స్ మ్యాత్ వర్క్ తదితర పరిశ్రమల నిపుణులు పాల్గొన్నారు. కెమికల్ ఇంజనీరింగ్ రంగంలో ప్రస్తుత పోకడలు, సవాళ్లు, అవకాశాలపై మాట్లాడారు. పరిశోధన, కన్సల్టెన్సీ కోసం ఐఐటీకి సహకరించడానికి వారు తమ ఆసక్తిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం అధ్యాపకులు, విద్యార్థులు పరిశ్రమ ప్రతినిధులతో సంభాషించడానికి ఒక వేదికను అందించి ప్రొఫెసర్ కెఎస్ఎంఎస్ రాఘవరావు తెలియజేశారు.

మృత్యుంజయుడికి ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి జనవరి 29: శ్రీకాళహస్తీశ్వరాలయంలో మృత్యుంజయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం ఉదయం మృత్యుంజయ సన్నిధిని అర్చకులు శుద్ధి చేశారు. అనంతరం భక్తుల నుంచి సంకల్పం స్వీక రించారు. వివిధ పూజా ద్రవ్యాలతో శాస్త్రోక్తంగా అభిషేకించారు. వేదమంత్రాలతో ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఉత్తమ బీఎల్‌వోకు సన్మానం



బుచ్చినాయుడుకండ్రిగ, జనవరి 29: వెస్ట్‌వరత్తూరు పోలింగ్ కేంద్రం బీఎల్‌వో అనురాధ ఉత్తమ బీఎల్‌వోగా అవార్డును కలెక్టర్ నుంచి అందుకున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం తహసీల్దార్ భార్గవి, సిబ్బంది ఆమెను సన్మానించారు.

ప్రతి విద్యార్థీ పాఠశాలలో ఉండాలి



తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంఈవోలు

బుచ్చినాయుడుకండ్రిగ, జనవరి 29: ప్రతి విద్యార్థీ పాఠశాలలో ఉండాలని ఎంఈవోలు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యం సూచించారు. మండలంలోని కొత్త కండ్రిగ ప్రాథమిక పాఠశాలను ఎంఈవోలు సోమవారం తనిఖీ చేశారు. కొందరు విద్యార్థులు పాఠశాలకు హాజరు కాకపోవడాన్ని గుర్తించారు. అనంతరం ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థుల తల్లిదండ్రులకు ఇంటికి వెళ్లి అవగాహన కల్పించి పాఠశాలకు తీసుకువచ్చారు. ప్రతిరోజూ విద్యార్థులు పాఠశాలకు వచ్చేలా ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలన్నారు.

క్రికెట్ రన్నర్స్‌కు సన్మానం

కేవీబీపురం, జనవరి29: నియోజకవర్గ స్థాయి ఆడుదాం ఆంధ్ర క్రికెట్ పోటీల్లో కేవీబీపురం జట్టు రన్నరప్‌గా నిలిచింది. సోమవారం జరిగిన ఫైనల్స్‌లో సత్యవేడు చేతిలో ఓటమి పాలైంది. ఈ క్రమంలో రన్నర్స్ జట్టును ఎంపీడీవో రామచంద్ర, నాయకులు సన్మానించారు.

శాస్త్రోక్తంగా గణపతి హోమం

శ్రీకాళహస్తి, జనవరి 29: శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో గణపతి హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. సంకటహర చతుర్థి పురస్కరించుకొని సోమవారం ఆలయంలోని అంజి అంజి గణపతి వద్ద విశేష పూజలు నిర్వహించారు. ముందుగా అర్చకులు స్వామి కొలువైన సన్నిధిని శుద్ధి చేశారు. అనంతరం కలశ స్థాపనతో సంకల్పం స్వీకరించారు. వినాయకస్వామికి విశేషంగా అభిషేకాలు చేశారు. వేదోక్తంగా వివిధ పూజా ద్రవ్యాలతో హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. ధూపదీప నైవేద్యాలతో హారతులు సమర్పించారు. ఆలయ ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులు, పాలక మండలి సభ్యులు కొండూరు సునీత, ప్రత్యేక ఆహ్వాన సభ్యురాలు శ్రీదేవి, పండితులు, అర్ధగిరి శర్మ, అర్చకులు, చరణ్ శర్మ, గోవింద శర్మ, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సుదర్శన్ నాయుడు, సుధాకర్, సుదర్శన్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

వేడుకగా త్యాగరాజ స్వామి ఆరాధన



శ్రీకాళహస్తి, జనవరి 29: త్యాగరాజ స్వామి ఆరాధన మహోత్సవం వేడుకగా జరిగింది. శ్రీకాళహస్తిలోని పొన్నాలమ్మ ఆలయ కళ్యాణ మండపంలో సోమవారం నాయీ బ్రాహ్మణ వాయిద్య కళాకారుల సంఘం ఆధ్వర్యంలో సద్గురు త్యాగరాజ స్వామి ఆరాధన ఉత్సవం జరిగింది. ముందుగా త్యాగరాజ స్వామి చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రముఖ విద్వాంసుల నాదస్వర కచేరితో కార్యక్రమం ప్రారంభమైంది. టీడీపీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సుధీర్ రెడ్డి చేతుల మీదుగా అన్నదానం ప్రారంభించారు. అనంతరం ముఖ్య అతిథులను నాయీ బ్రాహ్మణ వాయిద్య కళాకారుల సంఘం నాయకులు ఘనంగా సత్కరించారు. కోట చంద్రశేఖర్, మహేంద్ర పాల్గొన్నారు.

వైసీపీ అరాచకాలకు కాలం చెల్లింది



టీడీపీలో చేరిన చాన్‌బాషా, జావిద్

శ్రీకాళహస్తి, జనవరి 29: వైసీపీ అరాచకాలకు కాలం చెల్లిందని ఆ పార్టీ బాధితులు వాపోయారు. సోమవారం శ్రీకాళహస్తి పట్టణం హరహర బావి వీధికి చెందిన వైసీపీ నాయకులు చాన్‌బాషా, జావిద్ సుమారు 50 మంది మిత్రులతో కలిసి టీడీపీలో చేరారు. టీడీపీ శ్రీకాళహస్తి నియోజకవర్గం ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వలస నాయకులు చాన్‌బాషా మాట్లాడుతూ శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి గెలుపు కోసం ఎంతో కృషి చేశామన్నారు. తమ ఇంటి వద్ద ప్రభుత్వ పాఠశాల స్థలాన్ని ఓ నాయకుడు ఆక్రమిస్తుండగా తమ కుటుంబం ప్రశ్నించిందన్నారు. దీంతో అన్యాయంగా తమ కుటుంబంపై అక్రమ కేసులు పెట్టి వేధించారని వాపోయారు. శ్రీకాళహస్తిలో శాంతి భద్రతలను పరిరక్షించాలంటే తిరిగి గోపాల్ అన్న పాలన రావాలన్న ఆశయంతో టీడీపీలో చేరామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షులు విజయ్ కుమార్, పాలసరఫరా సంఘం మాజీ ఛైర్మన్ మునిరాజనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సిపాయికి పలువురి శుభాకాంక్షలు



రోగులకు ప్లేట్లు, స్వీట్లు పంచి పెడుతున్న డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం

తిరుపతి సిటీ, జనవరి 29 : రష్ ఆస్పత్రి అధినేత, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం 65వ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని పలువురు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం రష్ ఆస్పత్రిలో మేయర్ డాక్టర్ శిరీషా, రాష్ట్ర వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ భరత్‌కుమార్‌రెడ్డితో పాటు పలువురు డాక్టర్లు, వైసీపీ నేతలు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి, శాలువాలతో సత్కరించారు. అనంతరం ఆస్పత్రి సిబ్బందితో కలిసి కేక్ కట్ చేసి, రోగులకు పంచిపెట్టారు. రోగులకు అన్నం ప్లేట్లు, స్వీట్లను పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు చంద్రకుమార్, కృష్ణకాంత్, పవన్‌కుమార్, సుమంత్, శివకుమార్, లీలావతి పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి: వైసీపీ నాయకుడు దాము ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్ వద్ద కేక్ కట్ చేసి పేదలకు అన్నదానం చేశారు. అనంతరం ప్రభుత్వాస్పత్రిలో ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు.

రేణిగుంట: రేణిగుంట బస్టాండ్ వద్ద ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యంను వైద్యుడు, ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు జనార్ధన్, మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ రసూల్ ఘనంగా సత్కరించారు.

ఏర్పేడు: ఏర్పేడులో సర్పంచుల సంఘం అధ్యక్షులు నల్లపాళెం శివయ్య ఆధ్వర్యంలో డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం కేక్ కట్‌చేశారు.

నేడు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంపై అవగాహన

ఏర్పేడు, జనవరి 29: ఏర్పేడు మండలం చింతలపాళెం గ్రామంలో మంగళవారం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు సీఐ శ్రీరామ శ్రీనివాసులు తెలిపారు. చింతలపాళెం పంచాయతీలో ఉన్న దళితవాడ, గిరిజన కాలనీ షికారీకాలనీ గ్రామస్తులంతా ఈ కార్యక్రమంలో పాల్గొని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్‌పై అవగాహన పెంచుకోవాలని ఆయన కోరారు.

రేపు ఉద్యోగం మేళా

శ్రీకాళహస్తి, జనవరి 29: శ్రీకాళహస్తిలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో బుధవారం ఉద్యోగమేళా నిర్వహించనున్నారు. ఈ మేరకు ప్రిన్సిపాల్ శ్రీలత సోమవారం ప్రకటనలో వెల్లడించారు. చెన్నైలోని ప్రైవేట్ టెలికాం సంస్థలో వివిధ హోదాల్లో పనిచేసేందుకు ఆసక్తి కలిగిన అభ్యర్థులు హాజరుకావాలని కోరారు. వివరాలకు కళాశాల సిబ్బందిని సంప్రదించాలని కోరారు.

ఉత్తమ సేవకులకు సన్మానం

శ్రీకాళహస్తి, జనవరి 29: ఉత్తమ సేవకులుగా గణతంత్ర దినోత్సవం రోజున ప్రశంసలు అందుకున్న గౌడ సామాజిక వర్గ ప్రభుత్వ ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. శ్రీకాళహస్తి ఆర్డీవో కార్యాలయంలో పనిచేసే సంధ్య, పట్టణంలో ఏఎస్‌ఐగా పనిచేసే రాములను సోమవారం వారి నివాస గృహాల్లో కలసి గౌడ్ సంఘం నాయకులు సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈశ్వర్ గౌడ్, పురుషోత్తం గౌడ్, మోహన్ గౌడ్ పాల్గొన్నారు.

అల్లరి మూకలను అరికట్టండి



ఫిర్యాదు చేస్తున్న చక్రాల ఉష

శ్రీకాళహస్తి, జనవరి 29: శ్రీకాళహస్తిలో అల్లరి మూకలను అరికట్టాలని తిరుపతి పార్లమెంట్ తెలుగు మహిళా అధ్యక్షురాలు చక్రాల ఉష విజ్ఞప్తి చేశారు. తిరుపతి కలెక్టరేట్ సోమవారం జరిగిన స్పందనలో ఫిర్యాదు చేశారు. విద్యాసంస్థల వద్ద కనీస నిఘా కరువైందన్నారు. కొందరు విచ్చలవిడిగా గంజాయి విక్రయాలు సాగిస్తున్నారని ఆరోపించారు. నివాస గృహాలకు సమీపంలోనే మద్యం దుకాణాలు ఏర్పాటు చేయడంతో మహిళలు ఇబ్బందులు పడుతున్నారని తెలియజేశారు.

ఉచిత ప్రసాదం తనిఖీ

శ్రీకాళహస్తి, జనవరి 29: శ్రీకాళహస్తీశ్వరాలయంలో భక్తులకు పంపిణీ చేసే ఉచిత ప్రసాదాన్ని ఆలయ ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులు సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రసాదాల నాణ్యతను పరిశీలించారు. అనంతర్వ స్వయంగా భక్తులకు పంపిణీ చేశారు. స్వామి అమ్మవార్ల మూలమూర్తులకు సమర్పించే మహా నైవేద్యం ప్రసాదాన్ని ప్రముఖులకు మాత్రమే కాకుండా ఇకపై ఉచిత ప్రసాదంతో పాటు సామాన్య భక్తులకూ పంపిణీ చేయాలని సూచించారు.

ముక్కంటి అన్నదానానికి విరాళం



విరాళపత్రం అందుకుంటున్న డాక్టర్ రాజేష్ నాయుడు

శ్రీకాళహస్తి, జనవరి 29: శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి టీడీపీ నాయకులు డాక్టర్ రాజేష్‌నాయుడు రూ.50వేల నగదు విరాళంగా ఇచ్చారు. సోమవారం ఆయన ముక్కంటి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులను కలిసి నగదును అందజేశారు. అధికారులు శేష వస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు.

వైసీపీ నుంచి జనసేనలో చేరిక



శ్రీకాళహస్తి, జనవరి 29: తిరుపతిలోని ప్రైవేట్ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్న డాక్టర్ నక్క ప్రసాద్ వైసీపీని వీడి జనసేనలో చేరారు. శ్రీకాళహస్తికి చెందిన ప్రసాద్ జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి వినుత సమక్షంలో జనసేనలో చేరారు. పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయనకు వినుత కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్య క్రమంలో జనసేన నాయకులు చంద్రబాబు, రాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజాజీవనం అస్తవ్యస్తం

వైసీపీ పాలనతో ప్రజాజీవనం అస్తవ్యస్తంగా మారిందని కోట వినుత అన్నారు. మండలంలోని అబ్బాబాట్లపల్లి పంచాయతీ పరిధిలో ఇంటింటా ప్రచారం చేశారు.

వలంటీర్లను నియమించండి

వరదయ్యపాళెం, జనవరి 29: చిన్నపాండూరు పంచాయతీ నక్కలమిట్టలో వలంటీర్లను ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు సోమవారం వారు ఎంపీడీవో సుబ్రహ్మణ్యంరాజును కలిసి వినతిపత్రం అందజేశారు. నక్కలమిట్ట పరిధిలో సుమారు 250 కుటుంబాల వారు ఉన్నారన్నారు. ప్రభుత్వ పథకాల సమాచారం కోసం చిన్నపాండూరు సచివాలయానికి వెళ్లాల్సి వస్తోందని అన్నారు. దీంతో చాలా ఇబ్బందికరంగా ఉందని నక్కలమిట్టలో సుమారు 250 కుటుంబాల వారికి 4గురు వలంటీర్లను ఏర్పాటు చేయాలన్నారు. చదువుకున్న నిరుద్యోగులను వలంటీర్లుగా నియమించాలని కోరారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూపై అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామన్నారు.

కరువు ప్రాంతాల్లో అదనపు పని దినాలు కల్పించాలి



మాట్లాడుతున్న సుబ్బారావు

శ్రీకాళహస్తి, జనవరి 29: రాష్ట్రంలోని అన్ని కరువు ప్రాంతాల్లో వ్యవసాయ కూలీలకు అదనపు ఉపాధి హామీ పనులు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు సుబ్బారావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవన్‌లో సోమవారం వ్యవసాయ కార్మిక సంఘం తిరుపతి జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన సుబ్బారావు మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని కరువు ప్రాంతాల్లో వంద రోజులకు మరో 50 రోజులు అదనంగా పని కల్పించాలని కోరారు. బాలయ్య పల్లి మండలంలో దాదాపు 300ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, ఓ రెడ్డి సాగు బడిలో ఈ భూములున్నాయని వాటిని పేదలకు పంచాలని కోరారు. ఈనెల 31వ తేదీ నుంచి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బాలయ్యపల్లిలో భూపోరాటానికి వ్యవసాయ కూలీలు సిద్ధమవుతున్నట్లు స్పష్టం చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బాలకృష్ణ, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఐటీడీపీ కో-ఆర్డినేటర్‌గా ఖాదరవల్లి

శ్రీకాళహస్తి, జనవరి 29: శ్రీకాళహస్తి నియోజకవర్గ ఐ-టీడీపీ కో-ఆర్డినేటర్‌గా పట్టణానికి చెందిన ఖాదరవల్లిని నియమించారు. ఈ మేరకు పార్టీ కార్యాలయంలో సోమవారం నియోజకవర్గ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్ రెడ్డి నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఖాదరవల్లి మాట్లాడుతూ టీడీపీ విజయం కోసం శక్తివంచన లేకుండా కృషిచేస్తానన్నారు.

మాతా శిశుమరణాలు తగ్గించాలి

ఏర్పేడు, జనవరి 29: మాతా శిశు మరణాలను తగ్గించడానికి వైద్యసిబ్బంది చర్యలు చేపట్టాలని తిరుపతి జిల్లా టాస్క్‌ఫోర్సు అధికారులు సూచించారు. ఏర్పేడు మండలం పాతవీరాపురం విలేజ్ హెల్త్ క్లినిక్ పరిధిలో జరుగుతున్న ప్రజారోగ్య కార్యక్రమాలు, మాతా శిశు సమస్యలు, రక్తహీనతకు గురవుతున్న కారణాలపై జిల్లా స్టాటికల్ అధికారి నాగేంద్రబాబు, డీపీహెచ్ఎన్‌వో బేబీరాణి ఆరా తీశారు. పలు రికార్డులను పరిశీలించి తగు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టాస్క్‌ఫోర్సు సిబ్బంది శ్రీనివాసరావు, నాగేంద్ర కుమార్, ప్రకాష్, పీహెచ్‌సీ సిబ్బంది శివప్రియ, శివరాజు, ఆశ గౌరి, ఏఎన్ఎంపద్మ పాల్గొన్నారు.

ఊపిరితిత్తులకు అమరాలో ఆధునిక వైద్యం



మాట్లాడుతున్న డాక్టర్ రమాదేవి

రేణిగుంట, జనవరి29: మండలంలోని కరకంబాడి సమీపంలో ఉన్న అమరా ఆస్పత్రిలో ఊపిరితిత్తుల సమస్యకు అత్యాధునిక పరికరాలతో వైద్యం అందిస్తున్నామని ఆస్పత్రి అధినేత్రి డాక్టర్ రమాదేవి వెల్లడించారు. సోమవారం ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. చిత్తూరుకు చెందిన పూజిత అనే మహిళ ఊపిరి తిత్తులకు ఇన్‌ఫెక్షన్ ఏర్పడి శ్వాస పీల్చుకోవడం ఇబ్బందిగా మారడంతో చికిత్స కోసం తమ ఆస్పత్రిలో చేరినట్టు తెలిపారు. ఆక్సిజన్ లెవెల్స్ పెంచేందుకు ఎక్మో పరికరం ద్వారా చికిత్స అందించామన్నారు. దీంతో రోగికి ఆక్సిజన్ లెవెల్స్ సాధారణ స్థితికి వచ్చాయన్నారు. ఈ సమావేశంలో శ్వాసకోశ సంబంధిత వ్యాధుల స్పెషలిస్టు డాక్టర్ శివ కుమార్‌రెడ్డి, డాక్టర్ శంకర్, డాక్టర్ నాగరాజు, రాధిక, రాకేష్, హేమంత్, అనిల్, రాజేష్, సీఏవో వేణుగోపాల్ పాల్గొన్నారు.

పేరడం దళితులకు న్యాయం చేయాలి

సత్యవేడు, జనవరి 29: పేరడం గ్రామంలోని దళితుల స్వాధీన భూములపై దాడిచేసిన అగ్ర కులస్తులను అరెస్టుచేసి ఆ భూములకు పట్టా పాసు బుక్ ఇవ్వాలని దళితులు ధర్నా చేశారు. సీపీఎం, కేవీపీఎస్ ఆధ్వ ర్యంలో పోలీసుస్టేషన్, తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా సీపీఎం సత్యవేడు నియోజకవర్గ కార్యదర్శి జనార్ధన్ మాట్లాడుతూ పేరడం గ్రామ దళితుల స్వాధీనంలో ఉన్న భూమిలోని చెట్లను అగ్ర కులస్తులు తొలగించి దళితులపై దాడి చేయడం గర్హనీయమన్నారు. వెంటనే అగ్ర కులస్తులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం సీఐ దివాకర్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. అదే విధంగా తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు రమేష్, మురళి, బాషా, సీపీఎం, కేవీపీఎస్ కార్యకర్తలు,వివిధ గ్రామాల్లోని దళితులు, గిరిజనులు పాల్గొన్నారు.

పెద్దిరెడ్డిపై ఎమ్మెల్యే విమర్శలు అర్థరహితం: వైసీపీ

బుచ్చినాయుడుకండ్రిగ, జనవరి 29: సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మంత్రి పెద్దిరెడ్డిపై చేసిన ఆరోపణలు అర్థరహితమని వైసీపీ మండల నాయకులు పేర్కొన్నారు. మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జొన్నల గోపాల్‌రెడ్డి మాట్లాడారు. మంత్రిపై తప్పుడు ఆరోపణలు చేయడం సమంజసం కాదని హితవు పలికారు. మాజీ సర్పంచ్, దళిత నాయకుడు గురవయ్య మాట్లాడుతూ మండలంలో ఓ పెద్దాయనకు పెత్తనం ఇచ్చి దళితులకూ ఏమీ చేయకుండా ఇప్పుడు దళితుల గురించి మాట్లాడడం తగదన్నారు. నాయకులు సాయినాయుడు, గురునాథం ప్రసాద్‌పాల్, కొండా గిరి, ఎంపీటీసీ రవి, వెంకటేశ్వరు, మణి, నాగూర్, మునిరత్నం సురేష్ పాల్గొన్నారు.

సత్యవేడు: మంత్రి పెద్దిరెడ్డిపై ఎమ్మెల్యే ఆదిమూలం ఆరోపణలు అర్థరహితమని పలువురు వైసీపీ నాయకులు పేర్కొన్నారు. సత్యవేడు మండల వైసీపీ నాయకులు ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో మీడియాతో మాట్లాడారు. ఈ సమావేశంలో వైసీపీ మండల కన్వీనర్ సుశీల్‌కుమార్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, సింగిల్ విండో ఛైర్మన్ నిరంజన్‌రెడ్డి, బెల్ట్ రమేష్ పాల్గొన్నారు.

జగనన్న పట్టాదారులకు ఇళ్ల స్థలాలు చూపించండి



ధర్నా చేస్తున్న నాయకులు

రేణిగుంట, జనవరి29: మండలంలో మూడేళ్ల క్రితం పేదలకు ఇచ్చిన జగనన్న ఇంటి పట్టాదారులకు ఇంటి స్థలాలు చూపాలని వ్యవ సాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు తులసీరాజన్ డిమాండ్ చేశారు. సోమవారం రేణిగుంట తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో సుమారు 4 వేల మందికి జగనన్న ఇంటి పట్టాలు మంజూరు చేశారన్నారు. వారికి పాగాలి పంచాయతీ పరిధిలో ఇంటి స్థలాలు గుర్తించినట్టు చెప్పినా ఇప్పటివరకు చూపలేదన్నారు. అక్కడ రైతులకు నష్టపరిహారం చెల్లించి స్థలాలివ్వాలని లేనిపక్షంలో రేణిగుంట మండల పరిధిలో ఇవ్వాలని కోరారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు చలపతి, భాస్కర్ నాయుడు, ఖాదర్‌వలి, షంషాద్, సుబ్బలక్ష్మి, ఖాదర్ బాషా, వెంకటమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

జయహో బీసీని జయప్రదం చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న గురవారెడ్డి

శ్రీకాళహస్తి, జనవరి 29: వైసీపీ అరాచక పాలనతో దెబ్బతిన్న బీసీ వర్గాల్లో చైతన్యం తీసుకురావడమే ధ్యేయంగా నిర్వహిస్తున్న జయహో బీసీ సభలను జయప్రదం చేద్దామని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్డివారి గురవారెడ్డి పిలుపునిచ్చారు. శ్రీకాళహస్తిలోని టీడీపీ కార్యాలయంలో పార్టీ బీసీ నాయకులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా గురువారెడ్డి మాట్లాడుతూ ఎక్కడికి అక్కడ బీసీ గ్రామాల్లో వైసీపీ దురాగతాలను ఎండగట్టాలని చెప్పారు. ఆ తర్వాత మండల స్థాయిలో బీసీలను ఐక్యం చేస్తూ జయహో సభలతో టీడీపీ బీసీల కోసం అమలు చేయబోయే రక్షణ చట్టంపై అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామాల నుంచి నియోజకవర్గ స్థాయి వరకు నిర్వహించే జయహో బీసీ సభలపై ప్రణాళికను వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ బీసీ నాయకులు డాక్టర్ ఉమేష్ రావు తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ అటవీ కార్మికులకు న్యాయం చేయండి



నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

శ్రీకాళహస్తి, జనవరి 29: రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించాలంటూ మూడేళ్లుగా రిలే దీక్షలు చేస్తున్న టీటీడీ అటవీ కార్మికులకు వెంటనే న్యాయం చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. తిరుపతిలో టీటీడీ అటవీ కార్మికులు చేస్తున్న రిలే దీక్షలకు సంఘీభావంగా సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. జిల్లా ఉపాధ్యక్షులు అంగేరి పుల్లయ్య మాట్లాడుతూ 30 సంవత్సరాల సర్వీసు కలిగిన అటవీ కార్మికులను పక్కన పెట్టి పదేళ్ల బ్రేక్ ఆఫ్ సర్వీసు ఉన్నవారిని పర్మినెంటు చేయడంలో టీటీడీ ఆంతర్యమేంటో తెలియజేయాలని డిమాండ్ చేశారు. టీటీడీ యాజమాన్యం స్పందించి అటవీ కార్మికులకు న్యాయం చేయకుంటే ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఆర్డీఓకు వినతి పత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి పెనగడం గురవయ్య, గంధం మణి, రాజా, వలివేంద్రం, మూర్తి, మనోహర్ పాల్గొన్నారు.